ఆదివారం
30-10-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 128
పేజీలు : 8, వెల:రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఫిలిప్పీన్స్‌లో నల్గే బీభత్సం

2 లో

సోషల్ మీడియా ఉగ్ర ఆయుధం

- సాంకేతిక పరిజ్ఞానంతో నూతన సవాళ్లు
- కౌంటర్ టెర్రరిజం సంస్థకు 5 లక్షల డాలర్లు: జైశంకర్

న్యూఢిల్లీ: మానవాళికి ఉగ్రవాద ముప్పు పెరుగుతోందని, ఇది మరింత విస్తరిస్తోందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి చెందిన కౌంటర్ టెర్రరిజం కమిటీ ప్రత్యేక సమావేశంలో ఆయన శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. 'సమాజాన్ని అస్థిరపరిచే లక్ష్యంతో కుట్ర సిద్ధాంతాలను వ్యాప్తి చేయడంలో ఇంటర్‌నెట్, సామాజిక మాధ్యమాలు మిలిటెంట్ గ్రూప్‌ల టూల్‌కిట్‌లో శక్తిమంతమైన సాధనాలుగా మారాయి. కొత్తగా పుట్టుకొస్తున్న సాంకేతిక పరిజ్ఞానం సరికొత్త సవాళ్లను విసురుతోంది. మానవాళికి ఉన్న ఉగ్రముప్పును ఎదుర్కోవడానికి ఐరాస భద్రతామండలి తగిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ...ఉగ్రవాదం విస్తృతమవుతోంది. ఆసియా, ఆఫ్రికాలో ఈ పరిస్థితి తీవ్రమవుతోంది. ఉగ్రవాద నిరోధక ఆంక్షలు రూపొందించడంలో, ఉగ్రసంస్థలకు నిధులు అందించే దేశాలను నోటీసులో ఉంచడంలో మండలి కీలకంగా వ్యవహరించింది' అని మంత్రి జైశంకర్ అన్నారు. ఉగ్రవాదం జాఢ్యాన్ని నివారించేందుకు రెండు దశాబ్దాల నుంచి ఐక్య రాజ్యసమితి చెప్పుకోదగిన కృషి చేస్తున్నప్పటికీ, అది విస్తరిస్తోందన్నారు. ఈ టెక్నాలజీలు ప్రభుత్వాలకు, నియంత్రణ వ్యవస్థలకు నూతన సవాళ్లను విసురుతున్నాయన్నారు. ఉగ్రవాద నిరోధం లక్ష్యంగా ఆంక్షలు విధిస్తోందన్నారు. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ నిధులతో నడిచే వ్యవస్థగా మార్చిన దేశాలను ఎత్తి చూపేందుకు ఈ కృషి దోహదపడుతోందని చెప్పారు. ఇటువంటి కృషి జరుగుతున్నప్పటికీ ఉగ్రవాదం పెరుగుతూనే ఉందన్నారు. ఐరాస కౌంటర్ టెర్రరిజం ట్రస్ట్‌కు భారతదేశం ఈ ఏడాది 5 లక్షల డాలర్లు అందజేస్తుందని చెప్పారు. ఉగ్రవాదంపై పోరాటంలో సభ్య దేశాల

- మిగతా 2 లో

స్పాట్ అడ్మిషన్లు అయితే...

ఫీజు రీఎంబర్స్‌మెంట్ హుళక్కి?

- ప్రైవేటు కళాశాలల దందా
- 50 వేల ఇంజనీరింగ్ సీట్ల మిగులు
- అడుగడుగునా కౌన్సెలింగ్ జాప్యం
- ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రైవేట్ ఇంజినీరింగ్ యాజమాన్యం నిర్వహించే స్పాట్ అడ్మిషన్లలో చేరిన విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ దూరం కానుంది. కన్వీనర్ కోటాలో మిగిలిన సీట్లను సైతం యాజమాన్య కోటాలో కలుపుకుని భారీ మొత్తంలో ఫీజుల దందాకు ప్రైవేట్ కళాశాలలు పాల్పడుతున్నాయి. ప్రస్తుతం యాజమాన్య కోటా(కేటగిరి-బి)లో కంప్యూటర్, దాని అనుబంధ సీటు ఏడాదికి రూ.2 లక్షల వరకు నిర్ణయించారు. ఇదే ధరతో కన్వీనర్ కోటా (కేటగిరి-ఎ) సీట్లనూ స్పాట్ అడ్మిషన్ల పేరిట యాజమాన్యం విక్రయానికి ద్వారాలు తెరచింది. స్పాట్ అడ్మిషన్లో చేరితే...విద్యార్థికి ఎలాంటి ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఉండబోదని ప్రభుత్వం సంకేతాలిచ్చినట్లు తెలిసింది. దీనిపై అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. కేవలం కన్వీనర్ కోటాలో కౌన్సెలింగ్ సీటు పొంది, ఆన్‌లైన్‌లో రిపోర్టు చేసిన అర్హులైన వారందరికీ ఫీజు రీఎంబర్స్‌మెంట్ వస్తుంది. స్పాట్ ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం, ఉన్నతాధికారులు మౌనం దాల్చడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ ప్రభుత్వానికి విద్యార్థులు విన్నవిస్తున్నారు.

స్పాట్ ముసుగులో భారీ దోపిడీ

మూడో విడత కౌన్సెలింగ్ ఉండదనే ప్రచారంతో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల

- మిగతా 2 లో

'బేరసారాల' దోషులకు రిమాండ్

- హైకోర్టు కీలక తీర్పు
- ఏసీబీ కోర్టు ఉత్తర్వులు కొట్టివేత
- రోహిత్ రెడ్డికి భద్రత పెంచిన ప్రభుత్వం
- బీజేపీ పిటిషన్... 4వరకు స్టే

విశాలాంధ్ర-హైదరాబాద్: మూడురోజులుగా తెలంగాణను ఊపేస్తున్న 'ఎమ్మెల్యేల బేరసారాల' వ్యవహారంలో శనివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. ముగ్గురు నిందితులకు రిమాండ్ విధించింది. తక్షణమే సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. లేకపక్షంలో

- మిగతా 2 లో

ఫాసిజం దిశగా పెట్టుబడిదారీ వ్యవస్థ

- క్యూబా విప్లవాత్మక అంతర్జాతీయవాదం అభినందనీయం
- ఐకమత్యమే మహాబలం- ఏకమైతే సోషలిస్టు ప్రపంచ స్థాపన సాధ్యం
- కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీ సదస్సులో డాక్టర్ కె.నారాయణ

హవానా: సంక్షోభాల సుడిగుండంలో చిక్కుకున్న ప్రపంచం ఏకతాటికిపైకి రావడం ద్వారానే సమస్యలు పరిష్కరించగలమని, ప్రపంచవ్యాప్తంగా సోషలిస్టు సమాజాన్ని స్థాపించగలమని, శాంతి-సుస్థిరతను నెలకొల్పగలమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ నొక్కిచెప్పారు. ఆయన క్యూబా రాజధాని హవానాలో జరిగిన కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీ సదస్సులో మాట్లాడారు. క్యూబా విప్లవాలు ఆదర్శనీయమని, అక్కడి ప్రజల అంతర్జాతీయవాదం అభినందనీయమన్నారు. 'పెట్టుబడిదారీ వ్యవస్థ తన మనుగడ కోసం ఫాసిజం దిశగా అడుగులు వేస్తోంది. ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి. భవిష్యత్ వ్యూహాల కోసం సమగ్ర అధ్యయనాలు అవసరం. పెట్టుబడిదారీవాదంతో సామాజిక ఐక్యత నాశనమవుతోంది. అర్థరహిత వినిమయతత్వాన్ని ఇది పెంపొందిస్తోంది. నయా-ఉదారవాద ఆర్థిక విధానాల పరిధిలో సామాజిక రంగ ఉపసంహరణతో పెద్ద సంఖ్యాక ప్రజల్లో అనిశ్చితి, అభద్రతా భావం నెలకొన్నది. అసమానత్వం, నిరుద్యోగం, నివాస ప్రాంతాల వినాశనం, పర్యావరణ క్షీణత, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తదితర సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఇవి మతతత్వ పాలకవర్గాల లూటీ పర్యవసనాలు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు జాతి, కులం, మతం, వర్గం అంటూ విభేదాలు సృష్టిస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారు' అని నారాయణ విమర్శించారు.

మెరుగైన భవిష్యత్ కోసం పాటుపడుతున్న ప్రజలకు నారాయణ సంఘీభావాన్ని ప్రకటించారు. కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీల సదస్సు కీలకమైనదని చెప్పారు. సరిహద్దులు, ఖండాలు దాటుతున్న మన ఐక్యతకు ఇది చిహ్నమని ఆయన

- మిగతా 2 లో

43 మంది ఎమ్మెల్యేలకు బీజేపీ వల

ఆడియో టేపు బయట పెట్టిన డిప్యూటీ సీఎం సిసోడియా

న్యూఢిల్లీ: ఢిల్లీలో మొత్తం 43 మంది ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలను కొనేందుకు బీజేపీలోని కీలక వ్యక్తులు సంప్రదింపులు జరుపుతున్నారని ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఆరోపించారు. తెలంగాణలోనే కాకుండా దేశరాజధాని ఢిల్లీలోనూ డబ్బు ఎరగా చూపి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు కమలం దళం యత్నిస్తోందని ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. తన వాదనకు బలం చేకూర్చే విధంగా ఆడియో టేపును వినిపించారు.

దీనిపై తక్షణమే విచారణ జరిపించాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సంబంధం ఉన్నట్లు తేలితే ఆయనను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ, పంజాబ్‌లోని ఆప్ ఎమ్మెల్యేల కొనుగోలుకూ బీజేపీ యత్నించిందనేందుకు ఈ ఆడియోనే సాక్ష్యమన్నారు. దీనిపై ఈడీతో విచారణ జరపాలని సిసోడియా డిమాండు చేశారు. హోంమంత్రి స్థానంలో ఉన్న అమిత్ షా వంటి వ్యక్తి ఇలాంటి కుట్రలో భాగస్వాములు కావడం దేశానికే ప్రమాదకరమన్నారు. తెలంగాణలోనూ టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు పావులు కదిపి బీజేపీ దొరికిపోయిందని సిసోడియా విమర్శించారు.

ఈడీకి 'సుప్రీం' తలంటు

సమయం వృథా చేశారంటూ రూ.లక్ష జరిమానా

న్యూఢిల్లీ: విలువైన కోర్టు సమయాన్ని వృథా చేశారంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనికి తోడు స్టేషనరీ, లీగల్ ఫీజులు కూడా వృథా అయ్యాయని విచారం వెలిబుచ్చింది. పిటిషన్ దాఖలు చేసిన ఈడీ అధికారికి రూ.లక్ష జరిమానా విధించింది. అతడి జీతం నుంచి రికవరీ చేయాలని అధికారులను కోర్టు ఆదేశించింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ నిందితుడికి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను శనివారం సుప్రీంకోర్టు విచారించి ఈ మేరకు ఈడీపై కోపం ప్రదర్శించింది. క్యాన్సర్ బాధితుడిగా ఉన్న నిందితుడు ఓ ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. దాదాపు రూ.24 కోట్ల మేర మోసం చేసినట్లు ఆయనపై ఆరోపణలు రావడంతో అరెస్ట్ చేశారు. గత ఏడాది నవంబర్ 12న అలహాబాద్ హైకోర్టుకు పిటిషన్ రాగా.. ఆయన చికిత్స తీసుకున్న కమలా నెహ్రూ హాస్పటల్ హెల్త్ రిపోర్ట్ ఆధారంగా హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దాంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఈడీ

- మిగతా 2 లో

ఎన్నికల వేళ తెరపైకి ఉమ్మడి పౌరస్మృతి

- కమిటీ ఏర్పాటుకు గుజరాత్ మంత్రివర్గం నిర్ణయం
- బీజేపీ వివాదాస్పద చర్య

8 లో

చక్కెర ఎగుమతులపై ఆంక్షల పొడిగింపు

దేశీయ మార్కెట్లో సరుకుల లభ్యతను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం చక్కెర ఎగుమతులపై ఆంక్షలను వచ్చే ఏడాది అక్టోబర్ 31 వరకు పొడిగించింది. గతంలో ఈ ఏడాది అక్టోబర్ 31 వరకు ఆంక్షలు విధించారు.

ఇదీ లోకం!

బీజేపీతో భారత్‌కు ముప్పు

- రాష్ట్ర ప్రభుత్వాల కూల్చివేతకు కుట్రలు
- ఎమ్మెల్యేల కొనుగోలుకు వందల కోట్లు
- నియంత చేతిలో ఆంధ్రప్రదేశ్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్రబ్యూరో-కడప: బీజేపీ పాలనలో దేశం అత్యంత ప్రమాదకర పరిస్థితిలో పడిందని, నియంత పాలనలో ఆంధ్రప్రదేశ్ అస్తవ్యస్తంగా మారిందని, ప్రజల మాన, ప్రాణాలను హరిస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. దేశ, రాష్ట్ర పరిస్థితులను మార్చాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన

- మిగతా 2 లో

దేశాన్ని బలహీనపరుస్తున్న బీజేపీ

- నోట్ల రద్దుతో దేశం విచ్ఛిన్నం
- పేదల భూములపై 'గులాబీ' కన్ను
- జోడో యాత్రలో రాహుల్ గాంధీ

విశాలాంధ్ర-హైదరాబాద్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అన్నదమ్ముల నడుమ విద్వేషాలు రగిలించి దేశాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. నోట్ల రద్దుతో దేశాన్ని విచ్ఛిన్నం చేసిందని ధ్వజమెత్తారు. భారత్ జోడో యాత్ర 52వ రోజు రాహుల్ గాంధీ తన యాత్రను ధర్మాపూర్‌లోని జయప్రకాశ్ నారాయణ్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ప్రారంభించారు. ఒకవైపు నరేంద్ర మోదీ రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెస్తే, తెలంగాణాలో కేసీఆర్, దళిత, గిరిజనుల భూములు గుంజుకునే పనిలో పడ్డారని ఆరోపించారు. జీఎస్టీ ద్వారా చేనేత కార్మికుల నడ్డి విరిచారని మండిపడ్డారు. దేశంలో విధ్వంసాలకు, విద్వేషాలకు వ్యతిరేకంగా ప్రజలు నిలుస్తున్నారన్నారు. యాత్ర ద్వారా దేశ సమైక్యతను చాటి చెప్పే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశ చరిత్రకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని వ్యాఖ్యానించారు. దేశంలోని నలుగురు సంపన్నులకు మాత్రమే సంపదను కొల్లగొట్టి పెడుతున్నారని మండిపడ్డారు. దేశంలో అధిక సంపన్నులు, అధిక నిరుద్యోగులు ఉండటానికి బీజేపీ కారణమని గుర్తు చేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు, రైతులకు ఈ దేశంలో న్యాయం జరగదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే విద్య, వైద్య సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని రాహుల్ చెప్పారు. అనంతరం అక్కడి నుంచి గొల్లపల్లి సమీపంలోని లలితాంబిక ఆలయం వద్ద ఏర్పాటు చేసే రాత్రిబస వద్దకు యాత్ర చేరుకుంది. 4వ రోజు మరింత ఉత్సాహంగా సాగిన రాహుల్ యాత్రలో వేలాది మంది పాల్గొనగా సినీనటి పూనమ్ కౌర్ కూడా ఆయన్ను కలుసు కోవడం విశేషం. 52వ రోజు భారత్ జోడో యాత్ర,

- మిగతా 2 లో

ఫిలిప్పీన్స్‌లో నల్గే బీభత్సం

- భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలం
- 72కు పెరిగిన మృతులు - వందలాది మంది గల్లంతు
- నేలకూలిన చెట్లు - నీటిలో కొట్టుకుపోయిన ఇళ్లు
- నిలిచిన విమానాలు- ఇబ్బందుల్లో వేలాది మంది ప్రయాణికులు
- సురక్షిత ప్రాంతాలకు ఏడు వేల మంది

మనీలా: నల్గే తుపాను ఫిలిప్పీన్స్‌లో బీభత్సం సృష్టించింది. భారీ వర్షాలు, మెరుపు వరదలు ముంచెత్తాయి. విరిగిపడ్డ కొండచరియలు, మట్టిపెళ్లలు అల్లాడించాయి. శనివారానికి 72 మంది మృతి చెందగా వందలాది మంది గల్లంతయ్యారు. దాదాపు 500 ఇళ్లు ధ్వంసమయ్యాయి. రాజధాని మనీలాతో పాటు అనేక ప్రాంతాలు వరదల గుప్పిట్లో చిక్కుకోగా సముద్రం అల్లకల్లోలంగా ఉండి గంటకు 95 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ తీరప్రాంతాలను అతలాకుతలం చేశాయి. చెట్లు నేలకూలగా ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. నగరాలు, పట్టణాలతో పాటు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చాలా ఇళ్లు నీటమునిగాయి. కొన్ని కొట్టుకుపోయాయి. విమానసేవలు నిలిచిపోయి వేలాది మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. దక్షిణ ఫిలిప్పీన్స్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. మూడు లక్షల జనాభా ఉన్న కోటాబాటో నగరం వణికిపోయింది. కొండచరియలు విరిగి పడి వందలాది మంది గల్లంతైనట్లు అధికారులు పేర్కొన్నారు. లక్ష కుటుంబాలు ముంపునకు గురైనట్లు వెల్లడించారు. దాతు ఒడిన్ సినువాత్ పట్టణం సమీపంలోని కుసియోంగ్ అనే గిరిజన

గ్రామంలోనే 60 మంది వరకు మరణించినట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో జనం గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. ఈ గ్రామంలో 80 కుటుంబాలు ఉంటాయని చెప్పారు. శుక్రవారం వెలికితీసిన 11 మృతదేహాలలో చిన్నారులవే ఎక్కువగా ఉన్నట్లు ఐదు ప్రావిన్సుల అంతర్గత మంత్రి నాగ్యుబ్ సినారింబో వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే హెచ్చరించడంతో ప్రాణనష్టం తగ్గిందని, అనేక మందిని సహాయక బృందాలు సురక్షిత ప్రాంతాలకు చేర్చాయని చెప్పారు. ఏడు వేల మందిని ఆర్మీ, పోలీసులతో పాటు వలెంటీర్లు కాపాడినట్లు తెలిపారు. వర్షాలు మరికొన్ని రోజులు కొనసాగతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

దీంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. శుక్రవారం రాత్రికి మగ్యుడానోలో మృతుల సంఖ్య 67కు చేరినట్లు అధికారులు వెల్లడించారు. ఆర్మీ అధికారుల ప్రకారం 42 మంది మరణించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది సంభవించిన తుపాన్లలో ఇది 16వది.. గంటలకు 95కిమీల నుంచి 130కిమీల వేగంతో గాలులు వీచి మనీలాతో పాటు అనేక ప్రావిన్సులు, నగరాల్లో బీభత్సం సృష్టించిందని ప్రభుత్వ వాతావరణ కేంద్రానికి చెందిన ఫోర్‌కాస్టర్ శామ్‌దురన్ తెలిపారు. ఏటా 20 వరకు తుపాన్లు, టైఫూన్లు ఫిలిప్పీన్స్‌ను అల్లడిస్తుండటం విదితమే.

'బేరసారాల' దోషులకు రిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరచ్చి, అనంతరం రిమాండ్‌కు తరలించాలని పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

నలుగురు టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం కేసులో నిందితులైన రామచంద్ర భారతి అలియాస్ సతీశ్ శర్మ, కోరె నందు కుమార్ అలియాస్ నందు, డీపీఎస్‌కేవీఎన్ సింహయాజిలను అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు వారిని ఏసీబీ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ముగ్గురికి రిమాండ్ విధించాలని పోలీసులు కోరారు. అయితే రిమాండ్‌కు ఇవ్వాలన్న పోలీసుల విజ్ఞప్తిని న్యాయమూర్తి తిరస్కరించారు. కొనుగోలుకు యత్నించారనే ఆరోపణలపై సరైన ఆధారాలు లేవంటూ.. ముగ్గురు నిందితులకు రిమాండ్ విధించేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి గురువారం నిరాకరించారు. వారిని తక్షణమే విడుదల చేయాలని, 41 సీఆర్‌పీసీ కింద నోటీసులిచ్చిన తర్వాతే విచారించాలని స్పష్టం చేశారు. లంచం సొమ్ము దొరకనందున ఈ కేసుకు అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్) వర్తించదని స్పష్టం చేశారు. న్యాయమూర్తి ఆదేశాలతో నిందితులను గురువారం రాత్రి పోలీసులు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు 41 సీఆర్‌పీసీ కింద నిందితులకు నోటీసులు జారీ చేసి విచారణకు హాజరుకావాలని సూచించారు. రిమాండ్ విధించేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానంలో సైబరాబాద్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ముగ్గురు నిందితులు హైదరాబాద్ విడిచి వెళ్లొద్దని షరతు విధించింది. తమ నివాస చిరునామాలను సైబరాబాద్ పోలీసు కమిషనర్‌కు అందజేయాలని సూచించింది. పోలీసులకు ఫిర్యాదు చేసిన రోహిత్‌రెడ్డిని సంప్రదించడం గానీ, సాక్షులను ప్రభావితం చేయడానికిగానీ వారు ప్రయత్నించరాదని షరతు విధించింది. ఈ పిటిషన్‌పై విచారణను శనివారానికి వాయిదా వేసిన ధర్మాసనం.. సైబరాబాద్ పోలీసుల వాదనలతో ఏకీభవిస్తూ రిమాండ్‌ను తిరస్కరిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేసింది.

బీజేపీ పిటిషన్‌పై విచారణ.. దర్యాప్తుపై స్టే..

బీజేపీలో చేరితే కోట్ల రూపాయల నగదు ఇస్తామంటూ ప్రలోభ పెట్టడంపై మొయినాబాద్ పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తును సిట్ లేదా సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. వచ్చే నెల 4 వరకు దర్యాప్తుపై స్టే విధించిన న్యాయస్థానం, విచారణ వాయిదా వేసింది. ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సహా ప్రతివాదులుగా ఉన్న ఎనిమిది మందికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఈ కేసుపై రెండు ధర్మాసనాలు వేర్వేరు తీర్పులిచ్చాయి. దీంతో ఏం జరగనుందో వేచి చూడాలి.

ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి అదనపు భద్రత

తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి తెలంగాణ ప్రభుత్వం భద్రత మరింత పెంచింది. సంచలనం సృష్టించిన 'ఎమ్మెల్యేల బేరసారాల' కేసులో పోలీసులు నిర్వహించిన రహస్య ఆపరేషన్‌లో ఆయన కీలకంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు అదనపు భద్రతను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎస్కార్ట్ వాహనాన్ని సమకూర్చింది. ఆయన ఇంటి వద్ద పోలీసులు పికెట్‌ను ఏర్పాటు చేశారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సమకూర్చారు. ఇప్పటికే రోహిత్‌రెడ్డికి 4×4 భద్రతను ప్రభుత్వం కల్పించింది.

బీజేపీతో భారత్‌కు ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. కడప ప్రెస్‌క్లబ్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసుతో కలిసి రామకృష్ణ శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలను మోదీ సర్కారు విచ్ఛిన్నం చేస్తోందని రామకృష్ణ మండిపడ్డారు. రాష్ట్రాలను తమ హస్తగతం చేసుకోవడానికి 2016 నుంచి మోదీ ప్రభుత్వం కుయుక్తులు పన్నుతూ దేశ ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసిందన్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో మొదలు పెట్టిన బీజేపీ కుట్రలు... తెలంగాణ వరకు వచ్చాయని, రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలన్నింటినీ హస్తగతం చేసుకోవాలని కుయుక్తులు పన్నుతోందన్నారు. తెలంగాణలో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి బీజేపీ వేల కోట్ల డబ్బు వెదజల్లుతోందని, కేసీఆర్ ప్రభుత్వాన్ని కూల్చివేసే దిశగా పావులు కదుపుతోందని విమర్శించారు. మునుగోడు బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డికి గుజరాత్‌లో రూ.18 వేల కోట్ల కాంట్రాక్టు ఇస్తామని ఆశ చూపి తన వైపునకు తిప్పుకుందని, అందుకే మునుగోడుకు ఉప ఎన్నిక వచ్చిందని రామకృష్ణ వివరించారు. ఢిల్లీ కేంద్రంగా టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి బేరసారాలు చేస్తూ బీజేపీ బొక్కబోర్లా పడిందని చెప్పారు. భారతదేశం ఆకలిచావులతో అల్లాడుతున్నా పట్టని ప్రధాని మోదీ... అదానీ, అంబానీకి లక్షల కోట్లు విలువ చేసే సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. భారతదేశాన్ని ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి అనుగుణంగా తీసుకురావాలని మోదీ కుట్రలు పన్నుతున్నారని, వీటిని ప్రజలు దగ్గరగా పరిశీలిస్తున్నారని చెప్పారు.

ప్రత్యేక హోదా ఇవ్వలేదు... ప్రత్యేక ప్యాకేజీ నిధుల ఊసే లేకుండా రాష్ట్రాన్ని నట్టేట ముంచారని మోదీ సర్కారుపై రామకృష్ణ విమర్శలు గుప్పించారు. అయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రం అడుగులకు మొడుగులొత్తుతున్నారని, జగన్‌కు మోదీ జపం తప్ప మరో ప్రపంచం లేకుండా పోయిందని మండిపడ్డారు. జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో అరాచక, నియంతృత్వ పాలన కొనసాగుతోందన్నారు. భూదందాలు, ఇసుక, మద్యం, మైనింగ్ మాఫియాతో అరాచక శక్తులు రాజ్యమేలుతున్నాయని విమర్శించారు. వైజాగ్‌లో రిషికొండ గుండు గీచారని వ్యాఖ్యానించారు. అమరావతి రాజధానికి నాడు మద్దతిచ్చిన జగన్...నేడు మూడు రాజధానుల పాటపాడటం అతని నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. ఉత్తరాంధ్రలో భూములన్నింటినీ కాజేయడానికి జగన్ అండ్ కంపెనీ కంకణం కట్టుకున్నదని వెల్లడించారు. ఒకే రాజధాని కోసం అమరావతి రైతులు చేస్తున్న పాదయాత్రకు అడ్డంకులు కల్పించడాన్ని హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. రైతుల పాదయాత్రపై పోలీసులు దాడి చేయడం ప్రజా హక్కులను హరించడమేనన్నారు. అమరావతి కోసం ఏ పార్టీతో అయినా కలిసి పోరాటం చేయడానికి సిద్ధమేనని ఓ ప్రశ్నకు ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాయలసీమ అభివృద్ధి కోసం వ్యవసాయ రంగానికి, పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేయాలని, యూనివర్సిటీలు, ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంతో పాటు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వవలసిన అవసరం ఉందన్నారు.

ఓబులేసు మాట్లాడుతూ ఒకే దేశం- ఒకే యూనిఫారం అంటూ ప్రధాని నరేంద్రమోదీ చెప్పడం ప్రమాదకర సంకేతాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ఇది ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను మరింత ముందుకు తీసుకెళ్లడమేనని మండిపడ్డారు. ఇలాంటి అనాలోచిత విధానాలపై రాజకీయ పార్టీలన్నీ ఐక్య ఉద్యమానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నియమావళికే ఈసీ వక్రభాష్యం చెబుతోందని, పేదలకు ఉచిత పథకాలు వద్దని చెప్పడం మంచిది కాదన్నారు. దేశంలోని బడాబాబులు రూ.12 లక్షల కోట్లకు పైగా సంపదను కొల్లగొడితే అతీగతీ లేదని, కానీ పేదలకు ఇచ్చే పథకాలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. భారతదేశంలో 45 కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువున బతుకుతున్నారని, వారి అభ్యున్నతి కోసం పాటుపడాల్సిన ప్రభుత్వం...నీతిమాలిన చర్యలకు దిగజారడం పద్ధతి కాదన్నారు. కృష్ణపట్నం ఓడరేవు, దామోదర సంజీవయ్య విద్యుత్ ప్రాజెక్టును సీఎం జగన్ అదానీ చేతుల్లో పెట్టారని విమర్శించారు. సలహాదారుల పేరుతో ప్రజల సొమ్మును అప్పనంగా దోచుకుతింటున్నారన్నారు. ఇకనైనా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రజలకు నీతిమంత పాలన అందించాలని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ నాయకులు గుంటి వేణుగోపాల్, బాదుల్లా, ఆంజనేయులు, బషీరున్నీసా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లాహోర్ నుంచి ఇస్లామాబాద్ వరకు ఇమ్రాన్ ఖాన్ లాంగ్‌మార్చ్

- పాల్గొన్న వందలాది మంది
- ముందస్తు ఎన్నికలకు పీటీఐ డిమాండు
- వారెవ్వరినీ ఉండనివ్వొద్దు : హోటళ్లపై పోలీసుల ఆంక్షలు
- ప్రసారాలు వద్దు: మీడియాకు ప్రభుత్వాదేశాలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలో వందలాది మంది మద్దతుదారులు శుక్రవారం లాహోర్ నుంచి ఇస్లామాబాద్‌కు 'హకీకి అజాదీ మార్చ్'గా కదం తొక్కారు. కారులు, ట్రక్కులలో లాంగ్‌మార్చ్‌ను చేపట్టారు. ఏప్రిల్‌లో గద్దెదిగాల్సి వచ్చినప్పటి నుంచి ఇమ్రాన్‌ఖాన్ వరుసగా ర్యాలీలు నిర్వహిస్తూ తాజా ప్రభుత్వంపై తనకున్న వ్యతిరేకతను వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇస్లామాబాద్‌కు మార్చ్ చేరేసరికి అక్కడ పాకిస్తాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (పీటీఐ) మద్దతుదారులు లక్షల సంఖ్యలో ఉండాలని, రాజధానిలో ధర్నాకు సిద్ధం కావాలని ఇమ్రాన్ సూచించారు. ఇందుకోసం అధికారుల నుంచి అనుమతులు కోరినట్లు వెల్లడించారు. మార్చ్‌లో అక్కడక్కడ ఆగుతూ ప్రసంగాలు చేశారు. ఈ క్రమంలో మాట్లాడిన ఆయన 'ఇది రాజకీయ లబ్ది కోసమే వ్యక్తిగత ప్రయోజనాలు కోసమో లేక ప్రభుత్వాన్ని కూల్చేందుకో చేస్తున్నది కాదని దేశానికి స్వాతంత్ర్యం కోసం తాను చేస్తున్న పోరాటమని ఇమ్రాన్ ఖాన్ ఉద్ఘాటించారు. ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉంటే తేదీల విషయంలో షరీఫ్ ప్రభుత్వంతో మంతనాలకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది అక్టోబరులో ఎన్నికలు జరుగుతాయని పాకిస్తాన్ ప్రభుత్వం వెల్లడించగా అప్పటివరకు ఆగేదిలేదని ఇమ్రాన్ ఖాన్ అన్నారు.

ఇదిలావుంటే, ఇస్లామాబాద్‌కు చేరుకునే సరికి మార్చ్‌లో భాగమైన వారెవ్వరికీ తమ హోటళ్లలో బసకు అనుమతి లేదని శనివారం ఇస్లామాబాద్ పోలీసులు ఆదేశాలను హోటళ్లు, అతిథిగృహాలకు జారీచేశారు. మార్చ్‌కు ప్రాధాన్యత ఇవ్వవద్దని పాకిస్తాన్ ఎలక్ట్రానిక్ మీడియా నియంత్రణ యంత్రాంగం (పీఈఎంఆర్‌ఏ)కూ స్పష్టంచేస్తూ నోటిఫికేషన్ జారీ అయింది. లాంగ్ మార్చ్‌ను 'హకీకి అజాదీ మార్చ్' (నిజమైన స్వాతంత్ర్య మార్చ్) పేరిట లాహోర్లోని లిబర్టీ చౌక్ నుంచి మొదలు పెట్టారు. ఇఛ్రా, మొజాంగ్, దతా సాహిబ్, ఆజాదీ చౌక్ ప్రాంతాల్లో తమ బలాన్ని ప్రదర్శిస్తూ మార్చ్ ముందుకు సాగింది. నవంబరు 4న ఇస్లామాబాద్‌కు చేరుకోనుంది. అక్కడ భారీ నిరసన ర్యాలీ/ ధర్నా నిర్వహణకు కసరత్తు జరుగుతోంది.

జనసేన నాయకులకు పవన్ సన్మానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనసేన నేతలు, వారి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. విశాఖ అక్రమ కేసుల్లో జైలు పాలై హైకోర్టు ఇచ్చిన బెయిలుతో విడుదలైన తొమ్మిది మంది జనసేన నాయకులను ఆయన ఆత్మీయంగా సత్కరించారు. శనివారం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విశాఖ పార్టీ నేతలు, వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

ఈడీకి 'సుప్రీం' తలంటు

(మొదటిపేజీ తరువాయి)

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించి.. పరిస్థితులను బట్టి నిందితుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నందున ఈ కేసులో సుప్రీంకోర్టు జోక్యం అవసరం లేదని స్పష్టం చేశారు. ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసి సుప్రీంకోర్టు విలువైన సమయాన్ని వృథా చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పిటిషన్ వేసిన ఈడీ అధికారికి రూ.లక్ష జరిమానా విధిస్తున్నట్లు తీర్పు వెల్లడించింది. ఈ సొమ్మును నెల రోజుల్లోగా సుప్రీం కోర్టు రిజిస్ట్రీలో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. ఈ జరిమానాలో సగం మొత్తం నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీకి అందజేయనున్నట్లు కోర్టు పేర్కొంది. మిగిలిన మొత్తాన్ని సుప్రీం కోర్టు ఆర్బిట్రేషన్ అండ్ కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీకి అందజేయనున్నారు.

ఉగ్ర ఆయుధం

(మొదటిపేజీ తరువాయి)

సత్తాను పెంచేందుకు సహాయపడటం కోసం ఈ నిధులు ఇస్తామని తెలిపారు. ఈ సమావేశాలు మొదటి రోజు ముంబైలోనూ, రెండో రోజు ఢిల్లీలోనూ జరిగాయి. భారత్‌లో జరుగుతోన్న ఈ కౌంటర్ టెర్రరిజం కమిటీ ప్రత్యేక సమావేశాల్లో ప్రపంచ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాక్ గ్రే లిస్ట్‌లో ఉండగా దాడులు తగ్గాయి

భారత్ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) గ్రే లిస్ట్ వల్లే జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడులు తగ్గిపోయాయని పాక్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ మంత్రి జైశంకర్ అన్నారు. ఈ పరస్పర సంబంధాన్ని ఈ కమిటీ పరిశీలించాలని కోరారు. ఇటీవల 'గ్రే లిస్ట్' నుంచి పాక్‌ను ఎఫ్ఏటీఎఫ్ తొలగించిన సంగతి తెలిసిందే. దీంతో అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, యూరోపియన్ యూనియన్ తదితర సంస్థల నుంచి నిధులు పొందే అవకాశం పాకిస్తాన్‌కు ఏర్పడింది. ఉగ్రవాద సంస్థలకు నిధుల సరఫరాను కట్టడిచేసే లక్ష్యాలను పాక్ అందుకోకపోవడం వల్ల ఎఫ్ఏటీఎఫ్ నాలుగేళ్లపాటు ఆ దేశాన్ని గ్రే లిస్ట్‌లో ఉంచింది.

భారత్‌కు ధన్యవాదాలు: డేవిడ్

ఐక్య రాజ్య సమితి భద్రతా మండలికి భారత దేశ నాయకత్వం నూతన, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీపై ప్రధానంగా దృష్టి సారిస్తుందని ఐరాస భద్రతా మండలి కౌంటర్ టెర్రరిజం కమిటీ అధినేత డేవిడ్ చెప్పారు. ముఖ్యమైన సమస్యగానూ, ప్రధానంగా దృష్టి సారించవలసిన అంశంగానూ నూతన, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని చూస్తున్నదన్నారు. కమిటీ సమావేశాల అనంతరం ఓ వార్తా సంస్థతో డేవిడ్ మాట్లాడారు. ఉగ్రవాదం వల్ల సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రపంచం మొత్తానికి ఉగ్రవాద సమస్య ఉండకూడదనే లక్ష్యంతో అంతర్జాతీయ పరిష్కారాలపై దృష్టి పెట్టినందుకు భారత్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇది చాలా అద్భుత విషయమని తెలిపారు. ఈ సమస్యలను ఏ విధంగా ఎదుర్కొనబోతున్నదీ తెలిపే ప్రకటనను ఈ సమావేశాల అనంతరం విడుదల చేస్తామన్నారు. ఉగ్రవాదులు నూతన, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలను ఉపయోగించుకుంటుండటంపై అత్యున్నత స్థాయిలో చర్చించడం గొప్ప విజయమని చెప్పారు.

హుష్‌కాకి?

(మొదటిపేజీ తరువాయి)

యాజమాన్యాలు స్పాట్ అడ్మిషన్లకు ద్వారాలు తెరిచాయి. ఇష్టానుసారం సీట్ల విక్రయానికి సిద్ధమయ్యాయి. గుంటూరుకు చెందిన ఓ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం స్పాట్ అడ్మిషన్లకు ప్రకటన జారీజేసింది. ఇక మిగిలిన ఇంజినీరింగ్ కళాశాలలూ అదేబాట పట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 వేల ఇంజినీరింగ్ సీట్ల మిగులుకు ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యమే కారణమా? ప్రణాళికాబద్ధంగా సీట్ల భర్తీకి చర్యలు తీసుకోకపోవడమేనా?, అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఏపీ ఈఏపీసెట్-2022 తుది విడత కౌన్సెలింగ్ అనంతరం కన్వీనర్ కోటాలో 20 వేలకుపైగా ఇంజినీరింగ్ సీట్లు మిగిలిపోయాయి. యాజమాన్య కోటా(బి.కేటగిరి)లో మరో 30వేల సీట్లు మిగిలాయి. ఆ మొత్తం కలిపి 50 వేలకుపైగా సీట్లు భర్తీకి నోచుకోలేదు. సీట్లు ఉన్నప్పటికీ..చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. మూడో విడత కౌన్సెలింగ్ కోసం విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. ఈనెల 28వ తేదీన ఏపీఈఏపీసెట్ తుది విడత కౌన్సెలింగ్ సీట్లను ఖరారు చేశారు. తుది విడత కౌన్సెలింగ్‌లో 1,959 మంది పాల్గొని, మొత్తంగా 55,227 ఆప్షన్లు నమోదు చేశారు. వారిలో 11,408 మందికి సీట్లు కేటాయించారు. తుది విడత కౌన్సెలింగ్ అనంతరం 20 వేలకుపైగా సీట్లు మిగిలిపోయాయి. ఇప్పటివరకు రెండు విడతల్లో మొత్తం 92,661 మందికి సీట్లు కేటాయించారు. ప్రైవేట్ కళాశాలల్లో భారీగా సీట్లు మిగిలిపోవడంతో, వాటి భర్తీ కోసం యాజమాన్యం అడ్డదారులు తొక్కుతోంది. స్పాట్ అడ్మిషన్ల పేరుతో ప్రకటనలు జారీజేస్తూ, విద్యార్థుల నుంచి భారీగా ఫీజు వసూళ్లకు సిద్ధమయ్యాయి. 249 ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో మొత్తం 1,12,096 సీట్లు ఉన్నాయి.

సీట్ల మిగులుకు కారణాలివీ...

ఏపీఈఏపీసెట్ ప్రవేశ పరీక్షను నిర్దేశిత సమయంలో నిర్వహించకపోవడం, ఆ తర్వాత కౌన్సెలింగ్‌ను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం వెరసి 50 వేల సీట్ల మిగులుకు కారణంగా భావిస్తున్నారు. దానికితోడు ప్రైవేట్/డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో ముందస్తుగా ప్రత్యేక ప్రవేశ పరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం...కన్వీనర్ కోటా సీట్ల భర్తీపై ఆ ప్రభావం పడిందని విద్యార్థులు, తల్లిదండ్రులు పేర్కొన్నారు. పక్క రాష్ట్రాల ప్రైవేట్/డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో రాష్ట్రానికి చెందిన దాదాపు 40వేల మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ ప్రభావం కూడా కౌన్సెలింగ్‌పై పడింది. ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్ పూర్తయ్యేంత వరకు రాష్ట్రంలోని ప్రైవేట్, డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించకుండా నియంత్రించడంలో ఉన్నత విద్యాశాఖ పూర్తిగా విఫలమైందనే విమర్శలున్నాయి. రాష్ట్రంలోని చాలా ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో మౌలిక సౌకర్యాలు, బోధనా సిబ్బంది లేకపోవడం, ఇంజినీరింగ్ పూర్తయ్యాక ఉపాధి అవకాశాలు కల్పించలేకపోవడంతో చాలామంది ప్రైవేట్/డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ అంశాల్ని ప్రభుత్వం గమనించి, వచ్చే ఏడాది నుంచి ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి, అన్ని సీట్ల భర్తీకి ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అటు యాజమాన్య కోటా(బి.కేటగిరి)లో మిగిలిన సీట్లను ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్వహించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలి: పేరెంట్స్ అసోసియేషన్

ఏపీఈఏపీసెట్ మూడో విడత కౌన్సెలింగ్‌ను తక్షణమే నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శిఖరం నరహరి కోరారు. ఈ మేరకు సీఎం జగన్‌కు శనివారం ఆయన వినతిపత్రాన్ని పంపారు. ఏపీఈఏపీసెట్ తుది విడత కౌన్సెలింగ్ పూర్తయిన అనంతరం మిగిలిన ఇంజినీరింగ్ అడ్మిషన్లు భర్తీ చేసేందుకుగాను వెంటనే మూడో విడత నిర్వహించాలన్నారు. కన్వీనర్ కోటాలో మిగిలిన 20 వేల సీట్లను పకడ్బందీగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. యాజమాన్య కోటాలో మిగిలిన 30 వేల సీట్లనూ ప్రభుత్వ నిబంధనల ఆధారంగా భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దేశాన్ని బలహీనపరుస్తున్న బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణాలో 4వ రోజు జనజాతరగా ముందుకు సాగింది. జనసంద్రంతో సాగుతున్న యాత్ర పాలమూరు యూనివర్సిటీ, బండమీదపల్లి, గణేశ నగర్, వన్ టౌన్ చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్, న్యూటౌన్ చౌరస్తా, షాషాబ్ గుట్ట చౌరస్తా, మెట్టుగడ్డ, పద్మావతి కాలనీ మీదుగా యెనుగొండలోని గోపాలరెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన విరామ శిబిరానికి చేరుకుంది. ఇక నాలుగో రోజు యాత్రలో తెలంగాణ సీనియర్ కాంగ్రెస్ నేతలు రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, మధుయాష్కీ, సీతక్క వంశీచందర్ రెడ్డి, బల్మూరి వెంకట్ తదితరులు రాహుల్ వెంట ఉన్నారు. ఈ సందర్భంగా యాత్ర ప్రారంభం కాగానే రాహుల్‌కు ఎదురెళ్లి స్వాగతం పలికిన ఎమ్మెల్యే సీతక్క అడవి బిడ్డలతో అడుగులు వేస్తూ దేశాన్ని ఐక్యం చేస్తూ ముందుకు కదులుదాం అంటూ నినదించారు. ఆదివాసి డోలు మోగిస్తూ ఆటపాటలతో సంప్రదాయబద్ధంగా తమ పండగ జరుపుకుంటామని రాహుల్‌కు సీతక్క తెలిపారు. అలాంటి తమ సంప్రదాయాన్ని రాహుల్ అన్న గౌరవిస్తూ తమతో పాటు కలిసి కొమ్ము నృత్యం చేయడం చాలా ఆనందాన్ని కలిగించిందని ఆమె హర్షం వ్యక్తం చేశారు.

రాహుల్ డ్యాన్స్

భారత్ జోడో యాత్ర కల్చరల్ కమిటీ చైర్మన్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఏర్పాటు చేసిన ఖమ్మం జిల్లా ఆదివాసీలు ప్రదర్శించిన కొమ్ము కోయ డ్యాన్స్‌ను రాహుల్ గాంధీ మహబూబ్ నగర్ పాదయాత్రలో ఆసక్తిగా తిలకించారు. స్త్రీ, పురుషులు కలసి లయబద్ధంగా అడుగులు వేస్తూ చేసే కొమ్ము కోయ ప్రదర్శనలో కళాకారులతో కలిసి రాహుల్ అడుగులు వేస్తూ ఉత్సాహ పరిచారు. ఆదివాసీల కళారూపం గురించి రాహుల్‌కు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క వివరించారు. ఖమ్మంతోపాటు ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొండాకోనల్లో నివసించే ఆదివాసీలు తమదైన శైలిలో అనేకానేక కళారూపాలను సృష్టించారు. 10 నుంచి 15 మంది పురుషులు డోళ్లు వాయిస్తూ, లయబద్ధంగా అడుగులు కదిలిస్తూ వలయాకారంగా ఏర్పడతారని, దీన్ని 'పెరకోరు' అంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్‌తో పాటు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎమ్మెల్యే సంపత్ తదితరులు నృత్యం చేశారు.

ట్విట్టర్ ఇకపై విపక్షాల గొంతు నొక్కదని భావిస్తున్నా: రాహుల్

ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ట్విట్టర్‌ను హస్తగతం చేసుకున్న నేపథ్యంలో రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ట్విట్టర్‌ను తన చేతుల్లోకి తీసుకున్న ఎలాన్ మస్క్‌కు కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా మస్క్‌కు కంగ్రాట్స్ చెబుతూ ట్వీట్ చేశారు. ట్విట్టర్ ఇకపై విపక్షాల గొంతు నొక్కదని భావిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా తన ట్విట్టర్ ఖాతాలో ఇటీవల చోటుచేసుకున్న మార్పులకు సంబంధించిన ఓ గ్రాఫ్‌ను ట్వీట్‌కు జత చేశారు.

ఫాసిజం దిశగా పెట్టుబడిదారీ వ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మికశక్తికి మద్దతిస్తామన్నారు. సామ్రాజ్యవాద ఆంక్షలను తట్టుకుంటూ మొక్కవోని దీక్షతో ముందుకు సాగిన క్యూబాను అభినందించారు. క్యూబా ప్రజల విప్లవాత్మక అంతర్జాతీయవాదానికి సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. క్యూబా విప్లవస్ఫూర్తిని ఎవరూ అణచలేకపోయారని నారాయణ అన్నారు. క్యూబా ప్రజలు కమ్యూనిస్టు పార్టీ సారథ్యంలో సంక్షోభాలను అధిగమించగలిగారని చెప్పారు. నిత్యజీవితంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ అంతర్జాతీయ సంప్రదాయాలను మరువలేదన్నారు. కోవిడ్ కాలంలో వైద్య బృందాలను అవసరమైన ప్రాంతాలకు పంపి తమ వంతు సహాయ సహకారాలు అందించారని, క్యూబా విప్లవాత్మక అంతర్జాతీయవాదం అభినందనీయమని నారాయణ అన్నారు. క్యూబా ప్రజలకు సంఘీభావం తెలుపడం తమ పార్టీ కీలక కార్యకలాపాల్లో భాగమని, ప్రస్తుత పరిస్థితుల్లో క్యూబా ప్రజలకు సంఘీభావాన్ని రెట్టింపుస్థాయిలో అందించాలని సీపీఐ భావిస్తున్నదన్నారు. స్వాతంత్ర్యం, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం కోసం క్యూబా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో విజయవంతంగా పోరాటాలు సాగాయని తెలిపారు. సామ్రాజ్యవాద యాంత్రీకరణ కారణంగా అనేక ఖండాల్లో పిల్లలు, మహిళలు బలవంతంగా వలసబాట పట్టాల్సి వస్తోందని, సాయుధ ఘర్షణ అణుయుద్ధం ముప్పును సూచించిందన్నారు. ఈ పరిణామం శాంతి-సుస్థిరతకు తీవ్ర ముప్పు అని, యుద్ధం జరుగుతున్న ప్రాంతాలే కాకుండా యావత్ ప్రపంచానికి ప్రమాదకరమని నారాయణ నొక్కిచెప్పారు. అణుయుద్ధం జరిగితే నాగరికత అనేక ఏళ్లు వెనక్కి నెట్టబడుతుందని, ఊహించని కష్టాలను ప్రజలు అనుభవించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. శాంతి నెలకొల్పడం, అణు నిరాయుధీకరణ, సమానత్వం ఆధారిత మెరుగైన ప్రపంచాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని నారాయణ అన్నారు.

'సాంకేతిక పరిజ్ఞానానికి గొప్ప సామర్థ్యం ఉన్నదిగానీ దీనిని జెనోఫోబిక్ (జాత్యహంకారం), మతతత్వం, విద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు దుర్వినియోగం చేస్తున్నారు. అంతర్జాల తటస్థత కోసం పోరాటం మన కర్తవ్యం. అంతర్జాలం ద్వారా లభించే శిక్షణ అవకాశాలు కొందరికే పరిమితం కారాదు. అవసరార్థులందరికీ అందాలి. జ్ఞానాన్ని పొందడం మానవ-సామాజిక ప్రాథమిక హక్కు కావాలి. అందుకు మనమంతా పాటుపడాలి' అని నారాయణ స్పష్టంచేశారు. శ్రామికులు పోరాడి సాధించిన హక్కులకు నయాఉదారవాదంతో పనిలేదు...ఎందుకంటే అది కార్మికులను కాదు...కొందరు కేపిటలిస్టులనే సంపన్న సృష్టికర్తలుగా భావిస్తుంది. కార్మికులు/శ్రామికుల హక్కుల కోసం పోరాటాలు కీలకమని ఆయన తెలిపారు.

ప్రస్తుతానికి ప్రపంచ ముఖచిత్రం నిరాశగా ఉన్నా సామాజిక ఉద్యమాలకు మంచి ఉదాహరణగా లాటిన్ అమెరికా ఉందని నారాయణ అన్నారు. లాటిన్ అమెరికా దేశాలు ఒక దాని తర్వాత ఒకటిగా వామపక్షాలకు అధికారాన్ని కట్టబెట్టాయని, అమెరికా చెప్పుచేతల్లో ఉండే హింసాత్మక కన్జర్వేటివ్ ప్రభుత్వాలను గద్దెదించాయన్నారు. తమ ఉద్యమాల ద్వారా మిగతా దేశాలకు స్ఫూర్తిగా, ఆదర్శంగా లాటిన్ అమెరికా దేశాలు నిలిచాయని నారాయణ అన్నారు.

నయా ఉదారవాద అసమానత క్రమాన్ని చెదరగొట్టేలా కార్మికులు, మానవులతో పాటు పర్యావరణ హక్కుల కోసం సాగించే పోరాటాలు తీవ్రరూపం దాల్చాల్సిన అవసరం ఉందని నారాయణ అభిప్రాయపడ్డారు. ఇందుకోసం లెఫ్ట్ (వామపక్షం) చొరవ తీసుకొని ప్రపంచవ్యాప్తంగా సాగే ఉద్యమాలకు నాయకత్వం వహించాలన్నారు. సామ్రాజ్యవాద జోక్యాన్ని ముక్తకంఠంతో నిరాకరించాలని, శాంతి, సుస్థిరతను నెలకొల్పేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో ఐక్యంగా ఉంటే త్వరలోనే ప్రపంచ ముఖచిత్రాన్ని మార్చగలమని, ఉజ్వల భవిష్యత్‌ను భావితరాలకు అందించగలమని నారాయణ సూచించారు. ఐక్యతే మన బలం.. విడిగా ఉంటే బలహీనమవుతామని ఉద్ఘాటించారు. 'నేడు మనకున్న ముప్పును ఐక్యంగా ఎదుర్కొందాం.. ప్రపంచవ్యాప్తంగా శాంతి, న్యాయం, సోషలిజం కోసం ఏకమవుదాం.. ఐకమత్యమే బలం' అని నారాయణ పిలుపునిచ్చారు. తనకు ఆత్మీయ స్వాగతం పలికిన క్యూబా కమ్యూనిస్టు పార్టీకి ధన్యవాదాలు తెలిపారు.

రేపు అంగన్‌వాడీల రాష్ట్రవ్యాప్త ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల విషయంలో లింకు సూపర్‌వైజర్స్‌గా తాత్కాలికంగా సర్వీసు, చదువుకున్న వారిని నియమించాలని నిబంధనలను వ్యతిరేకిస్తున్నామని, రెగ్యులర్ సూపర్‌వైజర్‌ల ప్రక్రియ తక్షణమే చేపట్టాలని కోరుతూ అక్టోబర్ 31న రాష్ట్రవ్యాప్తంగా అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ తెలిపారు. శనివారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ల రాత పరీక్షలో అక్రమాలు జరిగాయని అనేకమంది కోర్టుకు వెళ్లారనీ, అయితే కోర్టు తీర్పు రాకముందే తాత్కాలిక లింకు సూపర్‌వైజర్స్‌ను నియమిస్తున్నామని ప్రకటన చేయడం తగదన్నారు. కోర్టు తీర్పు వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలే తప్ప ఇలా చేయడం తగదని హితవు పలికారు. తక్షణమే రెగ్యులర్ సూపర్‌వైజర్‌ల ప్రక్రియ నిర్వహించాలనీ, అవినీతి అక్రమాలకు తావు లేకుండా ఈ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ తాత్కాలిక సూపర్‌వైజర్ల నియామకాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 31న రాష్ట్రవ్యాప్తంగా అధికారులకు వినతి పత్రాలు అందిస్తామని, నిరసనలు తెలియజేస్తామని స్పష్టం చేశారు.

క్షురకులకు ఎస్మా బెదిరింపు దుర్మార్గం

ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్మా ప్రయోగిస్తామని క్షురకులను బెదిరించడం దుర్మార్గమని చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో విజిలెన్స్ తనిఖీల ద్వారా అవమానించినందుకు నిరసనగా ధర్నా చేసిన క్షురకులను ఎస్మా పేరిట ఆలయ అధికారి ఏవీ ధర్మారెడ్డి బెదిరించడాన్ని శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. టీటీడీలో అవినీతి తిమింగళాలను వదిలి పిచ్చుకపై బ్రహ్మాస్త్రం చందంగా పరిస్థితి ఉన్నదన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపడం ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. 'ఒప్పంద ఉద్యోగులుగా ఉన్న క్షురకులు ఉద్యోగ క్రమబద్ధీకరణను కోరుతుంటే ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేరాలని టీటీడీ యాజమాన్యం ఒత్తిడి చేయడంతో వారు కోర్టును ఆశ్రయించారు. దీన్ని సహించలేక వారిపై విజిలెన్స్ అస్త్రాన్ని ప్రయోగించారు. ఇందుకు నిరసనగా క్షురకులు ధర్నా చేశారు. నిరసనకారులతో చర్చించి సమస్యను పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగిస్తామని అధికారి బెదిరించడం తగదు. ఇప్పటికైనా క్షురకులకు కనీస వేతనంగా నెలకు రూ.26వేలు చెల్లించి.. ఉచిత బస్‌పాస్ కల్పించాలి. ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి' అని రామాంజనేయులు సూచించారు.

విశాఖ ఉక్కు మూసివేతకు కేంద్రం కుట్ర

625వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలు 625వ రోజుకు చేరుకున్నాయి. ఆర్ఎస్అండ్ ఆర్ఎస్, ఈఎండీ, ఎస్ఎస్ ఎండీ, డీఎస్ డబ్ల్యూ కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నవంబర్ 11న విశాఖలో ప్రధాని పర్యటన సందర్భంగానైనా అధికార- విపక్షాలు తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో కూడా లాభాలను తెచ్చిపెట్టి, రూ.28,000 కోట్లు టర్నోవర్ ఉన్న విశాఖ ఉక్కును ఈ ఏడాది రూ.1300 కోట్ల నష్టం వైపునకు నెట్టివేయడం కేంద్రప్రభుత్వ కుట్రలో భాగమేనని అన్నారు. నష్టాల పేరుతో పరిశ్రమను మూసేయాలను చూస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కావలసిన ముడిసరుకు కొనకుండా అనేక విభాగాలను మూసివేయడం వల్ల ఉత్పత్తి నిలిపేస్తున్నారని, రాష్ట్ర నాయకులకు బీజేపీతో చెలిమి ఉండటంతో వారెవ్వరూ ఈ విషయంలో నోరు విప్పడంలేదన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాస్, గుమ్మడి సరేంద్ర, పి.పెంటరావు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ పరిశ్రమను గట్టెక్కించండి

- మిల్లు యాజమాన్యాలతో చర్చలు జరపాలి
- రూ.1400 కోట్ల పెండింగ్ రాయితీలు విడుదల చేయాలి
- విద్యుత్ రాయితీ అమలుపరచాలి
- కార్మికులు, ఉద్యోగుల ఉపాధి కొనసాగించాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు: సబ్సిడీలతో కూడిన ఆర్థిక వాగ్దానాలు అమలు జరగని కారణంగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన స్పిన్నింగ్ పరిశ్రమను గట్టెక్కించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పిన్నింగ్ పరిశ్రమను, కార్మికులను కాపాడాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు పరిశ్రమల శాఖ డైరెక్టర్‌కు సీపీఐ తరపున విజ్ఞాపన పత్రాన్ని మెయిల్, వాట్సాప్ ద్వారా పంపించినట్లు తెలియజేశారు. రాష్ట్రంలో 125 మిల్లులు 35 లక్షల స్పిన్ డీల్స్ సామర్థ్యంతో పని చేస్తున్నాయని, ఈ స్పిన్నింగ్ మిల్లులపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2.50 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని చెప్పారు. అయితే సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న స్పిన్నింగ్ మిల్లులు గత కొంతకాలంగా 20 నుంచి 30 శాతం సామర్థ్యంతో మాత్రమే నడుస్తూ మూడు వంతులు మూత పడ్డాయని చెప్పారు. ప్రస్తుతం ఆర్థిక నష్టాలను భరించలేని స్థితిలో నూరు శాతం ఉత్పత్తి నిలుపుదల చేస్తున్నట్లు యాజమాన్యాలు ప్రకటించాయన్నారు. దీంతో పల్నాడు, గుంటూరు జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో ఉన్న స్పిన్నింగ్ మిల్లులన్నీ మూతపడటంతో లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు పనులు లేక పస్తులుండే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితి రానున్న పత్తి పంట ధరలపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పత్తి రైతులు అసాధారణ నష్టాలకు గురయ్యే ప్రమాదం ఏర్పడ నుందన్నారు. సంక్షోభంలో ఉన్న పరిశ్రమ పై విద్యుత్ చార్జీల పేరుతో భారాలు వేయడం సమంజసం కాదని, తక్షణమే భారాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని మిల్లు యాజమాన్యాలతో చర్చలు జరిపి రాష్ట్రంలో స్పిన్నింగ్ పరిశ్రమకు ఒక మంచి విధానాన్ని రూపొందించి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు అనేక రకాల రాయితీలు ఇచ్చి పరిశ్రమను, రైతులను ఆదుకుంటున్నా యని, అనేక రాష్ట్రాలు విద్యుత్ బిల్లుల రాయితీలను ఇవ్వడంతో పాటు చాలా రకాల సబ్సిడీలను అందిస్తున్నాయని తెలిపారు. ఇదేతరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పిన్నింగ్ పరిశ్రమను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ నిధులు రూ.1400 కోట్లను వెంటనే విడుదల చేయాలని, పరిశ్రమకు విద్యుత్ రాయితీని అమలు చేయాలన్నారు. పత్తి పంట ధరపై ఈ సంక్షోభ దుష్ప్రభావం పడకుండా రైతులకు లాభసాటి ధర లభించేటట్లు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులు, ఉద్యోగులు, రైతులను సమీకరించి ఆందోళనకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.

సీపీఐ గుంటూరు, పల్నాడు జిల్లా కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, ఎ.మారుతివరప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు కూడా కట్టలేని స్థితిలో నేడు రాష్ట్రంలోని స్పిన్నింగ్ మిల్లులు మూతపడుతున్నాయని, దీంతో కార్మికులకు వేతనాలు లేక రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి పరిశ్రమను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ పరిశ్రమలో పని చేస్తున్న లక్షలాది మంది కార్మికులకు, ఉద్యోగులకు వేతనాలతో పాటు ఆర్థిక ప్యాకేజీని ప్రభుత్వం ప్రకటించి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, చిలకలూరిపేట నియోజకవర్గ కార్యదర్శి నాగభైరు సుబ్బాయమ్మ, ఏఐటీయూసీ నాయకులు పేలూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం జయప్రదం చేయాలి

కార్మికవర్గానికి రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏఐటీయూసీ 103వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కార్మికవర్గానికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టేలా వ్యవస్థాపక దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్మిక శక్తి నిర్వీర్యానికి కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్లను కేంద్రం తెచ్చిందని, వీటిని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. 103వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం (31వతేదీ) అన్ని కేంద్రాలలో ఘనంగా కార్యక్రమాలు జరపాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఏఐటీయూసీ ఆవిర్భవించిన 103ఏళ్లలో జరిగిన కార్మిక పోరాటాలు అజరామరమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలతో పాటు దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం కోసం మతతత్వ, ఫాసిస్టుశక్తులను ఓడించే దిశగా ఏఐటీయూసీ పోరాడుతోందని తెలిపారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని, కార్ఖానా కార్మికుల పోరాటాలు, శ్రామికుల ఐక్య ఉద్యమాలను గుర్తుచేశారు. స్వాతంత్ర సాధనలోనూ ఏఐటీయూసీ కీలకంగా వ్యవహరించిందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను కార్మికులు కోల్పోవాల్సి వస్తోందని, దీనిని ప్రతిఘటించాలని రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

సీపీఐ, ఏపీ రైతుసంఘం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు భారీ ఎత్తున నష్టపోయారని, వారిని ఆదుకోవడం ప్రభుత్వం విఫలమైందని, రైతులను ఆదుకోకపోతే ప్రభుత్వంపై దశలవారీగా ఉద్యమిస్తామని సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బీ గిడ్డయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ఎన్ రసూల్, ఎస్ మునెప్పలతో కలసి విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనంతగా 20 రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురిశాయన్నారు. ఈకారణంగా రైతుల చేతికి వచ్చిన పంటలు కుళ్లిపోయి, పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలయ్యారన్నారు. సీపీఐ, ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో జిల్లాలో పర్యటించి పంటపొలాలను పరిశీలించినట్టు పేర్కొన్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి, మిర్చి, ఉల్లి, ఆముదం, మొక్కజొన్న, వేరుశనగ, జొన్న పంటలు తీవ్రంగా నష్టపోయారన్నారు. మిర్చి, ఉల్లి పంటకు 60వేలు, జొన్న, మొక్కజొన్న, పత్తి, ఆముదాలు తదితర పంటలకు 40వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సాగుకు ప్రభుత్వం బ్యాంకు ద్వారా ఇచ్చిన రుణాలు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రైతులు ఇంత పెద్దఎత్తున నష్టపోయినా ఇంత వరకు ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే వ్యవసాయ అధికారులు పంట నష్టపరిహారం నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పే వైసీపీ నాయకులు రైతులను ఆదుకోవడం విఫలమయ్యారని ఆరోపించారు. నవంబరు 7న సీపీఐ, ఏపీ రైతుసంఘం అధ్వర్యంలో సచివాలయాల ఎదుట ఆందోళన చేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకునేంత వరకు దశల వారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శులు మహేశ్, శ్రీనివాసరావు, రైతుసంఘం నాయకులు పులన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఏఓబీలో మావోయిస్ట్ భారీ డంప్ స్వాధీనం



విశాలాంధ్ర-చింతూరు: ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం రావడంతో ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా పోలీసులు, బీఎస్ఎఫ్ బలగాలు కటాఫ్ ఏరియాలో పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. ఏవోబీలోని మల్కన్‌గిరి జిల్లా, జొడొంబో పరిధిలోని కుసుముపుట్టు అటవీ ప్రాంతంలో భారీ డంప్‌ను పోలీసులు గుర్తించారు. ఈ డంప్‌లో ఆయుధాలతో పాటు భారీ పేలుడు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 303 రకం తుపాకీలు-3, గ్యాస్ గన్‌లు-2, దేశవాళీ తుపాకీలు-4, మందుపాతరలు-2, గ్రినెడ్‌లు-2, డిటోనేటర్లు-20 తో పాటు భారీ ఎత్తున పేలుడు సామాగ్రి, విప్లవ సాహిత్యం, తదితర సామగ్రిని గుర్తించారు. ఈ పేలుడు పదార్థాలు ఏవోబీ ఎస్ జడ్‌సీ మావోయిస్టు క్యాడర్‌కు చెందినదిగా పోలీసులు భావిస్తున్నారు. ఈ పేలుడు సామగ్రి, ఆయుధాలను అమాయక పౌరులు, భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని వారిని హతమార్చడానికి ఉంచినట్లు పోలీసులు భావిస్తున్నారు. గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్టు బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు.

విద్యార్థి... యువజన సమస్యలపై

పోరాటాలకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్రంలో విద్యార్థి, యువజన సమస్యల పై పోరాటాలకు సిద్ధం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. తిరుపతి, బైరాగిపట్టెడలోని జీఎస్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బండి చలపతి అధ్యక్షతన జరిగింది. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి, జిల్లా నిర్మాణ బాధ్యులు రామానాయుడు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థి, యువజన సమస్యలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రాంతాల మధ్య గొడవలు సృష్టించే ఆలోచనలతోనే ఉందని, విద్యా రంగం, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. అమ్మఒడి పేరుతో కోత పెట్టి... నాడు-నేడు కార్యక్రమం కూడా తూతూ మంత్రంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఇప్పటికీ చాలా జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు కూడా నోచుకోని దుస్థితి ఉందని అన్నారు. మరోవైపు కేంద్రంలోని మోదీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఇంతవరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా, ఉన్న ఉద్యోగాలనే ఊడ కొట్టారని విమర్శించారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చి పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని, జాతీయ నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని, భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా చదువుకున్న ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ నవంబర్ 25న చేపట్టిన చలో దిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్, జిల్లా ఆఫీస్ బేరర్లు సురేష్, ప్రవీణ్, సుందర్ రాజు, వినయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, కత్తి రవి, జిల్లా నాయకులు శ్రీను, మల్లి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ

విశాలాంధ్ర-నందిగామ రూరల్: సీపీఐ జాతీయ మహాసభల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. శనివారం నందిగామ రైతుపేటలోని చంద్ర రాజేశ్వరరావు భవన్ (సీపీఐ కార్యాలయం)లో నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్టా చామంతి అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ సమితి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీపీఐ జాతీయ మహాసభల స్ఫూర్తితో స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జాతీయ మహాసభలను విజయవంతం చేయుటంలో సహకరించిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు.

అక్కినేని వనజకు సత్కారం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలుగా ఎన్నికయి మొట్టమొదటిసారి నందిగామ కార్యాలయానికి విచ్చేసిన అక్కినేని వనజకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు వెంకట సుబ్బారావు, సీనియర్ నాయకులు వట్టికొండ చంద్రమోహన్, వల్లంకొండ బ్రహ్మం, వీరులపాడు ఎంపీటీసీ సభ్యులు ప్రకాశరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుట్టి రమేష్, సహాయ కార్యదర్శి కట్టా చామంతి, మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు (అంజి), మన్నెం నారాయణరావు, మౌలాలి, నాగు, పోల్నీడి నాగభూషణం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదరికం తగ్గుముఖం

ఆర్బీఐ మాజీ గవర్నర్ రంగరాజన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, బహుళ ప్రయోజనకర సంక్షేమ పథకాల వల్ల పేదరికం గణనీయంగా తగ్గిందని ఆర్థికవేత్త, ఆర్బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ సి.రంగరాజన్ తెలిపారు. 75ఏళ్ల స్వతంత్ర భారతం- ఆర్థిక పురోగతి' అంశంపై ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం దృశ్యమాధ్యమ విధానంలో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ పాలనలో 0.85శాతంగా ఉన్న జీడీపీ... స్వాతంత్ర్యం వచ్చాక ఎనిమిది శాతానికి పెరిగిందన్నారు. కరోనా కారణంగా జీడీపీ ఆరు శాతానికి తగ్గిందని, ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని అన్నారు. ఆర్థిక వృద్ధి మెరుగవుతుందనీ, విద్య, పారిశ్రామికీరణ పెరగాల్సిన అవసరముందన్నారు. 2005-15లో పేదరికం బాగా తగ్గిందని, ఇది ప్రగతికి సూచికమని రంగరాజన్ అన్నారు. కాగా, విశ్వవిద్యాలయ ఉపకులపతి మనోజ్ కే ఆరోరా తొలుత రంగరాజన్‌కు ఆహ్వానం పలికారు. సమీక్షకు హాజరైన ప్రొఫెసర్లు, విద్యార్థులను ఆయనకు పరిచయం చేశారు. ఆధునిక కౌటిల్య రంగరాజన్ అని ఉపకులపతి డి.నారాయణరావు కొనియాడారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ బండి కామయ్య, ప్రొఫెసర్లు ఎర్రా కమల్ సాయి, ఆనందరావు పాల్గొన్నారు.

ఏపీజీఎల్ఐ ప్రీమియం

పరిమితుల్లో మార్పులు

- 57 ఏళ్లు దాటితే అనర్హత
- ప్రభుత్వ బీమా సంచాలకులు లింగమూర్తి వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ పీఆర్సీ-2022 అనుసరించి ప్రభుత్వ బీమా (ఏపీజీఎల్ఐ) కు సంబంధించి నిర్బంధ స్లాబ్ రేట్ల గరిష్ఠ పరిమితిని సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వ బీమా సంయుక్త సంచాలకులు (విజయవాడ) ఎస్.లింగమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, గ్రామ, వార్డు సచివాలయ, మున్సిపల్, కార్పొరేషన్, ప్రజారవాణ ఉద్యోగులకు ప్రభుత్వ బీమాకు 21 నుంచి 57 సంవత్సరాల వయస్సుగా నిర్ధారించినట్లు వెల్లడించారు. గతంలో అమలు చేసిన గరిష్ఠ ప్రీమియం పరిధి 20 శాతాన్ని ఈ ఉత్తర్వుల ద్వారా రద్దు పరచి, అన్ని పాలసీల గరిష్ఠ ప్రీమియాన్ని ప్రస్తుత మూల వేతనంపై 15 శాతం వరకు పెంపుదల నిర్వహించేలా మార్పులు చేశారని పేర్కొన్నారు. మూల వేతనం పై 8 శాతం కన్నా పైబడిన ప్రీమియం చెల్లించిన ఉద్యోగులు, వారి మూడేళ్లలో వాడుకొనిన వైద్య సెలవుల వివరాలను (ఎస్ఆర్ కాపీలతో) డీడీవోతో ధ్రువీకరించి, సివిల్ సర్జన్ లేదా సివిల్ అసిస్టెంట్ సర్జన్‌తో జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రీమియం జమ చేసిన తేదీ నుంచి మొదట పాలసీ జారీ చేస్తారని, ఉద్యోగి ఒక ఏడాది సర్వీసును విజయవంతంగా పూర్తి చేశాకే గరిష్ఠ ప్రీమియంపై 15 శాతం వరకు పెంపుదల కొనసాగించేలా అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయాలను ఉద్యోగులందరూ గమనించి ప్రీమియం పెంచిన తర్వాత నెలలో ప్రతిపాదనలు డీడీఓ ద్వారా పంపి పాలసీలు పొందాలన్నారు. 57 ఏళ్లు దాటిన తర్వాత పంపిన ప్రతిపాదనలను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమన్నారు. అలాంటి వాటిని ఇన్సూరెన్స్ బోనస్ లేకుండా అనధికార మొత్తాలుగా పరిగణించి చందాదారులకు తిరిగి చెల్లిస్తామని పేర్కొన్నారు.

త్వరలో సీలేరులో ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు

సీఈ శేషారెడ్డి

విశాలాంధ్ర - సీలేరు (అల్లూరి జిల్లా): సీలేరు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీజెన్‌కో కేంద్ర కార్యాలయం.. విద్యుత్‌సౌధ(గుణదల) చీఫ్ ఇంజనీర్ (హైడల్ ప్రాజెక్టు) శేషారెడ్డి తెలిపారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు(ఎత్తిపోతల ప్రాజెక్టు)ను రూ.10 కోట్లతో ప్రతిపాదించినట్లు చెప్పారు. ప్రాజెక్టు సీఈగా ఆయన శనివారం సీలేరు కాంప్లెక్స్‌లో పర్యటించారు. ప్రాజెక్టుకు పర్యావరణ, అటవీశాఖ అనుమతులు రెండు, మూడు నెలల్లో లభిస్తాయని, ఆ తర్వాత పనులు మొదలవుతాయని చెప్పారు. సీలేరు కాంప్లెక్స్‌లోని పొల్లూరు, డొంకరాయి, సీలేరు, మాచ్‌ఖండ్ ప్రాజెక్టులు కీలకమైనవని, వాటి పనితీరుతో లోపాలు ఉంటే వెంటనే సరిచేస్తామన్నారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 5, 6 యూనిట్లకు టెండర్ల ప్రక్రియ పూర్తి అయిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని అన్నారు. బలిమెల జలాశయం దిగువన ప్రతిపాదించిన ఏపీ పవర్‌హౌస్ నిర్మాణం పెండింగ్‌లో ఉందని, రెండు రాష్ట్రాల మధ్య అంగీకారం కుదరక జాప్యం జరుగుతోందన్నారు. పొల్లూరు, డొంకరాయి జలవిద్యుత్ కేంద్రాలు, డొంకరాయి నుంచి పొల్లూరుకు నీటిని విడుదల చేసే పవర్ కెనాల్స్‌ను అధికారి పరిశీలించారు. సీలేరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు స్థలాన్ని, గుంటవాడ జలాశయాన్ని, సీలేరు జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ ప్రశాంత్‌కుమార్, ఈఈ జాకీర్ హుస్సేన్, ఏడీఈలు సుధీర్, అప్పలనాయుడు, ఏఈ సురేశ్ ఉన్నారు.

KAKINADA MUNICIPAL CORPORATION
'e' Procurement Notification

ROC. No. E-22498/2022/E2, **Dt : 29-10-2022**

Tenders invited through ap e procurement platform for 39 woks with an estimated contract value of **Rs. 14,38,09,837/-** from the eligible contrnctors in the following manner.

Six Works for an amount of Rs. 17,04,153/-

Last date and time for downloading did documents : **05.11.2022 upto 10-00AM**
Last date and time for submission of bids : **05.11.2022 upto 10-30AM**

Five Works for an amount of Rs. 35,85,464/-

Last date and time for downloading did documents : **14.11.2022 upto 10-00AM**
Last date and time for submission of bids : **14.11.2022 upto 10-30AM**

Twenty Eigth Works for an amount of Rs. 13,85,20,220/-

Last date and time for downloading did documents : **21.11.2022 upto 10-00AM**
Last date and time for submission of bids : **21.11.2022 upto 10-30AM**

Tender Inviting Authority : **Commissioner, Municipal Corporation, Kakinada.** Mail : kkd_mplcorp@yahoo.com Call Centre Phone : 0884-2357722. **Further Details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in**

Yours Faithfully,
Sd. K. Ramesh,
Commissioner
Municipal Corporation, Kakinda

సంపాదకీయం

వివక్ష వీడని మోదీ

కేంద్రంలో గత ఎనిమిదేళ్లుగా పరిపాలిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రాల పట్ల వివక్షను అనురిస్తూనే ఉన్నారు. రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారు. బీజేపీ రాష్ట్రాలకు నిధుల కేటాయింపులోనూ, అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టడంలో మోదీ అనుసరించిన వివక్షను బహుశా గతంలో ఏ ప్రధానీ అనుసరించి ఉండరు. 2014లో లోకసభకు ఎన్నికలు జరగడానికి ముందు ప్రచారంలో చేసిన ముఖ్యమైన వాగ్దానాలనూ నెరవేర్చలేదు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తానని అనేక ఎన్నికల ప్రచార సభల్లోనూ హామీ ఇచ్చి మాట తప్పారు. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలపట్ల సవతిప్రేమను చూపిస్తూనే ఉన్నారు. మహారాష్ట్రలో శివసేన నాయకుడు ఉద్దవ్ థాక్రే నాయకత్వంలో ఏర్పాటు చేసిన సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కేంద్రంలోని బీజేపీ అధినాయకత్వం కీలకపాత్ర వహించి నాటకాన్ని రక్తి కట్టించింది. శివసేన నుండి దాదాపు 20మంది ఎమ్మెల్యేలకు కావలసినవన్నీ సమకూర్చి పార్టీ ఫిరాయింపు చేయించి ఏక్‌నాథ్‌షిండే ముఖ్యమంత్రిగా చేసి బీజేపీ మరో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయినప్పటికీ షిండే ప్రభుత్వం విఫలమైందని నిరూపించడానికి మహారాష్ట్రకు కేటాయించిన భారీ ప్రాజెక్టులను త్వరలో ఎన్నికలు జరగనున్న గుజరాత్‌కు తరలించి మోదీప్రభుత్వం మరోసారి తనవివక్షను ప్రదర్శించింది. మహారాష్ట్రలో ఉపముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ఉన్నారు. షిండే ముఖ్యమంత్రి అయినప్పటికీ పరిపాలనలో తీసుకునే నిర్ణయాలలో ఫడ్నవీస్ తెరవెనుక ఉండి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత మూడు నెలలకాలంలో మహారాష్ట్రకు కేటాయించిన నాలుగు భారీ ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించారు. దాదాపు 2.25లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో నెలకొల్పనున్న ప్రాజెక్టులు పూర్తయితే దాదాపు 2లక్షలు ఉద్యోగాలు లభిస్తాయన్నది అంచనా. దేశ ఆర్థిక రాజధాని ముంబై అన్న పేరుంది. అలాగే మహారాష్ట్ర అనేక పరిశ్రమలకు నిలయంగా ఉంది. పెట్టుబడులలోనూ మొదటిస్థానంలో ఉంది. అయితే నిరుద్యోగం తాండవిస్తోంది. తాజాగా ఈ రాష్ట్రానికి 21.935 కోట్ల పెట్టుబడితో నెలకొల్పవలసిఉన్న టాటా ఎయిర్‌బస్ ప్రాజెక్టను గుజరాత్‌కు తరలించారు. 6 వేలకుపైగా ఉద్యోగాలు లభిస్తాయని అంచనావేసిన అ ప్రాజెక్టను నాగపూర్‌లో నిర్మించాలని నిర్ణయించారు. దీన్ని ఇప్పుడు గుజరాత్‌లోని వదోదరలో నెలకొల్పనున్నారు. అంతకుముందు వేదాంత-ఫాక్స్‌కాన్ సంస్థ లక్షన్నరకోట్ల రూపాయలకుపైగా పెట్టుబడిపెట్టి సెమీ కండక్టర్ చిప్ తయారీ ప్రాజెక్టను నెలకొల్పడానికి అవగాహన ఒడంబడిక పత్రంపై సంతకాలు కూడా జరిగాయి. ఈ ప్రాజెక్టు లక్షకుపైగా ఉద్యోగాలు కల్పిస్తుందని అంచనా. అయితే బీజేపీ కేంద్ర నాయకత్వం ఒత్తిడితో గుజరాత్‌కు యాజమాన్యం తరలించింది. తమ ఒత్తిడి ఏమీలేదని బీజేపీ బుకాయించింది. ఏ విషయంలోనూ పారదర్శకతలేని మోదీ ప్రభుత్వం వాస్తవ చెప్పడం చాలా అరుదు.

ఈ ప్రాజెక్టులకంటే ముందు 3వేలకోట్ల రూపాయల పెట్టుబడి, 50వేల ఉద్యోగాలు ఇస్తామని బల్క్ డ్రగ్ పార్కు యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసుకున్నది. అయినప్పటికీ మహారాష్ట్రకు రానివ్వకుండా అడ్డుపడి గుజరాత్‌కు తరలించారు. అలాగే ఔరంగాబాద్‌లో 424కోట్ల రూపాయలతో మహారాష్ట్ర ప్రభుత్వం వైద్య పరికరాల పార్కును ఏర్పాటు చేయడానికి అన్నీ సిద్ధం చేసుకున్న అనంతరం దాన్నీ ఇతర రాష్ట్రాల బాట పట్టించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణమైతే పదివేల ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. ప్రాజెక్టు నిర్మాణానికి 2020లోనే మోదీ ప్రభుత్వం ఆమోదించింది. ఇన్ని అక్రమ చర్యలకు కేంద్రం పూనుకున్నప్పటికీ ముఖ్యమంత్రి, షిండే మౌనంగానే ఉన్నారు. ఎక్కడా స్పందించలేదు. షిండే అనుచరులైన 20మంది ఎమ్మెల్యేలను త్వరలో బీజేపీలో చేర్చుకోబోతున్నారన్న వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. తనకు కష్టాలు తప్పవేమోనన్న అందోళనలో షిండే ఉన్నారని భావించవచ్చు. ఇతర రాష్ట్రాలకు కేటాయించిన ప్రాజెక్టులు గుజరాత్‌కు తరలించడానికి ఎన్నికల కమిషన్ మోదీకి కావలసినంత సమయం ఇస్తుందేమోనన్న విమర్శలూ వస్తున్నాయి. 2014లో పార్లమెంటు ఎన్నికలకు ముందు అభివృద్ధికి గుజరాత్ నమూనా అంటూ ప్రచారం సాగించి ప్రయోజనం పొందిన విషయం తెలిసిందే. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల ఆశ కల్పించి గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడంకోసమే ఈ మాయోపాయాలన్నీ పన్నుతున్న మోదీ సామర్థ్యానికి పరీక్షే అని విశ్లేషకులు చెపుతున్నారు. దాదాపు 27ఏళ్ల తర్వాత గుజరాత్‌లో ముక్కోణపు పోటీ జరగనుంది.

గత ఎన్నికల్లో మొత్తం 182 స్థానాలకుగాను కాంగ్రెస్ 77 సీట్లు గెలుచుకుంది. వివిధ కారణాల వల్ల కాంగ్రెస్ కొంత బలహీన పడిందని, రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ప్రభావం వల్లకొంత పుంజుకోవచ్చునని భావిస్తున్నారు. దిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి కొన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేస్తూ అమ్ ఆద్మీపార్టీ నాయకుడు కేజ్రీవాల్ ఈ సారి గుజరాత్‌పై కన్నువేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి క్రమంగా ఇతర రాష్ట్రాలకు విస్తరించాలని ఆయన కోరుకుంటున్నారు. అయితే ధన ప్రభావంతో గెలిచే అవకాశాలు లేకపోలేదని అంచనాలు వస్తున్నాయి. ఇటీవల మోదీ అక్కడ చాలా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తూ గెలుపు తమదేనన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నుంచి గట్టిపోటీ ఎదురవుతుండడం, ప్రస్తుతం ప్రభుత్వ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని విశ్లేషకులు చెప్తున్నారు. అనేకసార్లు గుజరాత్‌లో పర్యటించి వాగ్దానాలు చేయడం గెలుపుపై మోదీ ఆందోళన చెందుతున్నారని స్పష్టమవుతోంది.

పోరాట యోధుడు గురుదాస్ దాస్‌గుప్తా

కార్మిక ఉద్యమనేత, కమ్యూనిస్టు యోధుడు , ప్రభుత్వ రంగ పరిశ్రమలు, భీమా, రక్షణ రంగాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అటు కార్మిక ఉద్యమాల ద్వారా ఇటు పార్లమెంట్‌లో కూడా గళ మెత్తిన అలుపెరుగని గొప్ప పార్లమెంటేరియన్ కామ్రేడ్ గురుదాస్ గుప్తా. నిహార్‌దేవిదుర్గా ప్రసన్నదాస్‌గుప్తా దంపతులకు 3 నవంబర్ 1936న బ్రిటీష్ ఇండియా (ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉంది) బరిసల్‌లో జన్మించారు. 18 జూన్ 1965 న జయశ్రీ దాస్ గుప్తాను వివాహం చేసుకున్నాడు. విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించాడు. 1957 లో అసుతోష్ కాలేజ్ స్టూడెంట్స్ యూనియన్‌కి జనరల్ సెక్రటరీగా అలాగే 1958 నుండి1960 వరకు అవిభక్త బెంగాల్ ప్రావిన్షియల్ స్టూడెంట్స్ ఫెడరేషన్‌కి ప్రెసిడెంట్‌గా

జనరల్ సెక్రటరీగా పనిచేశాడు. 1965లో డిఫెన్స్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ఆయనను నిర్బంధించారు. 1950-60లలో చాలాసార్లు అజ్ఞాతంలోకి వెళ్ళాడు. దాస్‌గుప్తా 1967నుండి1977 వరకు ఆలిండియా యూత్ ఫెడరేషన్ పశ్చిమ బెంగాల్ కమిటీకి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 1968, 1970, 1973లో పశ్చిమ బెంగాల్ యూత్ ఫెస్టివల్ ప్రిపరేటరీ కమిటీకి జనరల్ సెక్రటరీగా కూడా పనిచేశాడు. 1970 లో బుడాపెస్ట్‌లో జరిగిన యువజన కాంగ్రెస్‌కు భారత ప్రతినిధి బృందానికి ఆయన నాయకత్వం వహించారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్‌కు ఉపాధ్యక్షుడిగా పనిచేశాడు. 25ఏళ్ల పాటు పార్లమెంటేరియన్‌గా కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడారు. 1985,1988,1994లో రాజ్యసభ సభ్యునిగా ఎన్నికయ్యారు దాస్‌గుప్తా 2001లో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2004లో సిపిఐ జాతీయ సెక్రటేరియట్ సభ్యునిగా ఎన్నికయ్యారు. 2004లో, పశ్చిమ బెంగాల్‌లోని పన్స్‌కురా నుంచి14వ లోక్‌సభకు 2009లో, పశ్చిమ బెంగాల్‌లోని ఘటల్ నుండి 15 వ లోక్‌సభకు ఎన్నికయ్యారు. హర్షద్ మెహతా స్కామ్, స్పెక్ట్రమ్ కేసులో జాయింట్ పార్లమెంటరీ కమిటీ సభ్యుడుగా నికోలస్ పిరామల్ ఆర్థిక కుంభకోణం గురించి వెలుగులోకి తీసుకొని వచ్చారు. పార్లమెంట్‌లో ప్రత్యేక తెలంగాణ కొరకు చర్చించిన ఇద్దరిలో ఒకరు గురుదాస్‌గుప్తా, ఒకరు బిజెపి నాయకురాలు సుష్మాస్వరాజ్ మరొకరు. అనేక సార్లు ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలకు హైదరాబాద్‌ను సందర్శించారు. 4-4-2010లో సింగరేణి ప్రాంతమైన శ్రీరామ్ పూర్ ఏరియాను సందర్శించి ఏఐటీయూసీ ఆఫీస్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మరల 29-4-2012, ప్రారంభోత్సవానికి హాజరై కార్మికులను ఉద్దేశించి ఉత్తేజకరమైన ప్రసంగం చేశారు. ఎన్నో ప్రభుత్వ రంగ సంఘాల, ప్రైవేట్ రంగ సమాఖ్యలకు అధ్యక్షునిగా, కార్యదర్శిగా ఎన్నికై కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు చేశాడు.

కార్పొరేట్ శక్తులకు సింహ స్వప్నంగా ఉండి, ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టిన మహనీయుడు. విదేశాల్లో ఉన్న నల్ల ధనాన్ని భారత దేశానికి తిరిగి తేవాలని పోరాడిన గొప్ప వ్యక్తి. సీపీఐ పార్టీకి కార్యదర్శిగా పని చేయమని పార్టీ నాయకులు సలహా ఇస్తే తాను కేవలం కార్మిక వర్గ ప్రతినిధిగా జీవిస్తానని తెలియజేశాడు. క్రికెట్ ఆటను ఇష్టపడుతూ అతి నిరాడంబరంగా జీవించాడు. ఆయన అతి సాదా సీదా బట్టలు వేసుకునే నిరాడంబర జీవి. భార్య జయశ్రీ దేవి అనారోగ్యంగా ఉన్నను ఎవరి సహాయం తీసుకొనకుండా దిల్లీలోని కేనంగ్ వీధిలో జీవించారు. దాదాపుగా పదిహేడు సంవత్సరాలు ఏఐటీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శిగా పనిచేశారు. చివరిదశలో ఊపిరితిత్తుల కేన్సర్ బారిన పడి తన 83 వ ఏట 2019 అక్టోబర్ 31 న కోల్‌కత్తాలోని ఆయన స్వగృహంలో కన్ను మూశారు. భారతదేశ ప్రప్రథమ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆవిర్భావం జరిగిన తేది కూడా అక్టోబర్ 31 కావడం యాదృచ్ఛికం. కామ్రేడ్ గురుదాస్ గుప్తా అమరుడైనను ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రస్తుత కార్మిక నాయకులు కృషి చేయవలసిన అవసరముంది.

(రేపు గురుదాస్ దాస్‌గుప్తా వర్ధంతి సందర్భంగా)

ఎ. వేణుమాధవ్, 8686051752

రైతుభరోసా కేంద్రాలపై నిరాశ

రావుల వెంకయ్య

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్భాటంగా ప్రవేశపెట్టిన రైతుభరోసా కేంద్రాలు రైతులను తీవ్ర నిరాశకు గురిచేసాయి. వైయస్సార్ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల గురించి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నది. వాటిని సమగ్రంగా పరిశీలిస్తే వాటి బాగోతం బయటపడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 10,778 కేంద్రాలను నెలకొల్పారు. వాటి పని విధానం అరకొరగానే సాగుతున్నది. దానికి కావలసిన ఉద్యోగాలు పూర్తిగా భర్తీ చేయలేరు. 1600 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 4,500 మండలాల్లో ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒకరే మూడు కేంద్రాలు బాధ్యత నిర్వహించే వారు కూడా ఉన్నారు. అవి పూర్తి చేయడానికి ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నది.

రైతుకు కావలసిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందించాలి. అవి నత్త నడకన అమలవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2021-22 ఎరువుల అమ్మకాలు 680 కోట్ల రూపాయలు విలువైన 61/2 లక్షల టన్నుల ఎరువులు అమ్మకాలు జరిగాయి. 2020 ఖరీఫ్ నుండి 2022 వరకు 1,36 వేల లీటర్ల పురుగు మందులు విక్రయించారు. ఎరువులు కోసం వెళ్లిన రైతులు యూరియా, సల్ఫేట్ కోసం అడిగితే అవసరం లేని కాంప్లెక్స్ ఎరువులు అంటకడుతున్నారు. యూరియా కావాలంటే ముందుగా డబ్బులు కట్టాలని తర్వాత తెప్పిస్తామని చెబుతున్నారు. అవి ఎప్పటికీ వస్తాయో తెలియటం లేదని రైతులు వాపోతున్నారు. ఎరువుల కోసం రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదురుచూస్తూ ఆందోళనకు గురవుతున్నారు. సీజన్ ముగిసిపోతుందని భయాందోళనకు గురవుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10,778 రైతు భరోసా కేంద్రాలలో సగటు అమ్మకాలు ఈ విధంగా ఉన్నాయి. ఎరువులు 2021-22లో 700 బస్తాలు, పురుగు మందులు 12.62 లీటర్లు, విత్తనాలు 13.60 కిలోల లెక్కన అమ్ముడుపోయాయి. దీనిని బట్టి రైతు భరోసా కేంద్రాలు రైతుకు రావలసిన ఎరువుల పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతున్నది. ఇది జగన్ ప్రభుత్వం రైతులను ఆదుకునే విధానం. రైతులవద్ద ధాన్యం కొనుగోలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ కేవైసీ, ఈ మార్కెటింగ్ విధానాలు రైతులకు అర్థంకాక మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. రైతుల పేరుతో మిల్లర్లు కార్డులు నమోదు చేసుకుంటున్నారు. అమ్మిన తరువాత డబ్బు చెల్లింపులు కూడా ఒక ప్రహసనంగా తయారైంది. 21 రోజులకు చెల్లించాల్సిన డబ్బులు మూడు నెలల నుండి ఆరు నెలల వరకు పడుతున్నది. ఇప్పుడు ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన మొత్తం 2,500 కోట్లకు పైగానే ఉన్నది.

రైతు భరోసా కేంద్రాల్లో ఉండాల్సిన టీవీలు, కియోస్కులు సరిపోయినంతగా లేవు. టీవీలు 50శాతానికి పైగా పనిచేయటం లేదు. విద్యుత్‌లోపం వల్ల మిగిలిన టీవీలు కూడా సరిగా ఉండటం లేదు. రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగస్తులు గ్రామాలకు వెళ్లి రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చి అధిక దిగుబడికి సహాయపడాల్సిన వారు ఆఫీసులకు పరిమితమవుతున్నారు. ఆఫీసులలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, పంటల కొనుగోలు, అమ్మకాలు, జమ ఖర్చులు రాసుకుని గుమస్తాలుగా పని చేస్తున్నారు.

జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రణాళికలో రైతులను ఆదుకోవడానికి రైతులందరికీ ఒక్కొక్కరికి రూ.12,500 చొప్పున డబ్బు రైతు ఖాతాలో జమ చేస్తామన్నారు. ఇప్పుడు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి నుండి రూ.6,000 రూపాయలు కలుపుకొని 13,500 రూపాయలు చెల్లిస్తున్నారు. ఆయన వాగ్దానం ప్రకారం 12,500+6000 మొత్తం రూ.18,500 రావలసి ఉండగా రాష్ట్ర వాటా రూ.7,500 మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ చెల్లింపులు కూడా అర కొరాగానే ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం రైతు కుటుంబాలు 86 లక్షల మంది ఉండగా జగన్ ప్రభుత్వం డబ్బు చెల్లిస్తున్నది కేవలం 50 లక్షల మందికి మాత్రమే. కౌలు రైతులు 16 లక్షల మంది ఉంటే 50 వేల మందికి మాత్రమే చెల్లిస్తున్నారు. ఇక కౌలు రైతులు కోలుకునేది ఎట్లా. రాష్ట్రంలో మొత్తం రైతులలో ఈ రైతు భరోసా సగం మందికి కూడా రావటం లేదు. ఇది ఎక్కడి రైతు భరోసానో రాష్ట్రంలోని రైతులందరూ అర్థం చేసుకోవలసి ఉన్నది.

గతంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, సహకార సంఘాల ద్వారా సరఫరా చేసేవారు. అవి ఇప్పుడు రైతు భరోసా కేంద్రాలకు అప్పచెప్పారు. ఇప్పుడైనా సహకార వ్యవస్థను పటిష్ఠ పరిచి వాటికి అప్పచెబితే మంచిది. అలాగే రైతుల పంటల నమోదు గతంలో రెవెన్యూ డిపార్ట్మెంట్ వారు చూసేవారు ఇప్పుడు కూడా వారికే అప్పచెపితే మంచిది. భూముల వివరాలు, పంటల వివరాలు వారికి తెలిసినట్లుగా రైతు భరోసా ఉద్యోగులకు తెలియదు. కనుక ఈ వ్యవస్థను మెరుగుపరిచి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాస రచయిత అధ్యక్షులు, అఖిల భారత కిసాన్ సభ

భారతీయ శాస్త్రవేత్తల మహోన్నత వ్యక్తిత్వం



డాక్టర్ దేవరాజు మహారాజు

జ్ఞానమే అన్నిటికంటే గొప్ప ధనం ఎవరికి వారు నేనెంత ధనవంతుణ్ణి-అని ప్రశ్నించుకోవాలి! చదువు వ్యాపారమై పోయింది. కళలు అమ్ముడు పోతున్నాయి. స్నేహానికి, అనుబంధాలకు కొత్త అర్థాల్ని వెతుక్కోవాల్సివస్తోంది. భాషా సంస్కృతులు బీటలు వారుతున్నాయి. మనిషి మాత్రం దినదినమూ పురోగమిస్తున్నాడు. నిజమే! కాని, ఆ పురోగమనం మానవీయ విలువల్ని నిలబెట్టగలుగుతోందా? ఆలోచించాల్సిన విషయం. యువతరానికి ఏవో కొన్ని ధ్యేయాలు ఏర్పరచి, వారిని వాటి చుట్టూ తిరిగేట్టు చేస్తున్నాం. నిజానికి డాక్టర్లు, ఇంజినీర్లు, సాఫ్ట్‌వేర్ పర్సనల్స్‌తో సమాజం ఆరోగ్యవంతమైపోదు. ఆరోగ్యవంతమైన ఆలోచనలు గల వ్యక్తులతో సమాజం ఆరోగ్యవంతమౌతుంది. వృత్తి పరంగా ఎదిగినా, వ్యక్తులుగా చాలామంది మరుగుజ్జుల్లాగా మిగిలి పోతున్నారు. మన ముందు తరాలవారిని, వారి జీవనశైలిని గమనిస్తే, మనకు చాలా విషయాలు అర్థమౌతాయి. ఏ వృత్తిలో రాణించినా వ్యక్తులుగా వారు అద్వితీయంగా నిలబడ్డారు. శాస్త్ర వైజ్ఞానిక రంగంలోని భారతీయుల జీవితాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే గొప్ప వ్యక్తులుగా, గొప్ప కళాకారులుగా, గొప్ప శాస్త్రజ్ఞులుగా వారు ఎలా ఎదిగారన్నది అర్థమౌతుంది. బీదతనంలో కొట్టుమిట్టాడుతూ కూడా, ఎక్కడా ఏ అవకాశమూలేని రోజుల్లో వారు ఒక చిన్న అవసరానికి ఎంతగానే సంఘర్షించాల్సి వచ్చింది. నెపోలియన్ హిల్, వ్యక్తిత్వ వికాస రచయిత ఇలా అంటాడు. "గొప్ప విజయాలెప్పుడూ గొప్ప త్యాగాలతోనే సాధ్యమవుతాయి. స్వార్థంతో ఎప్పటికీ శిఖరాగ్రాలను చేరలేవు" అని!

క్రీ.పూ. ఆరవ శతాబ్దంలో సుశ్రుతుడు ముందుచూపుతో శస్త్రచికిత్స పరికరాలు తయారు చేయకపోతే, ఆ తరువాత ఆరువందల ఏళ్లకు చరకుడు ఆయుర్వేద గ్రంథాల్ని పరిష్కరించకపోతే, గణితశాస్త్రంలో వర్గం, వర్గమూలం, ఘనం, ఘనమూలం, త్రిభుజవైశాల్యం మొదలైనవన్నీ ఆర్యభట్టు ప్రస్తావించకపోతే, మనం ఈ రోజు ఇలా ఉండేవాళ్లం కాదు! కంప్యూటర్లు, కాలిక్యులేటర్లు లేని కాలంలో ఆర్యభట్టు అంతటి శాస్త్రాన్ని ఎలా గ్రంధస్థం చేయగలిగాడన్నది ఎంతో విస్మయం కలిగించే విషయం. క్రీ.శ.630లలో భూమికి ఆకర్షణశక్తి ఉందనిచెప్పిన బ్రహ్మగుప్తుడు, ఖగోళ శాస్త్రానికి సంబంధించి కొన్ని సూత్రీకరణలు చేశారు. 1840 ప్రాంతంలోనే గజల్ ప్రక్రియను సైన్స్‌లోకి మళ్లించి, మూఢనమ్మకాల నిర్మూలనకు జీవితాంతం కృషి చేశాడు-మాస్టర్ రామచంద్ర.

డాక్టర్ మహేంద్రలాల్ అలోపతిక్ డాక్టరైనా హోమియో వైద్య విధానాన్ని ప్రోత్సహించాడు. ఈయన శాస్త్రీయ జిజ్ఞాసుడే కాదు, గొప్ప సాహిత్య ప్రియుడు కూడా! తనబుద్ధి బలంతో, ఊహాశక్తితో, శాస్త్రీయ పరికరాలు లేకుండా 1860లలో కొండ ఎత్తును నిర్ధారించడం సామంత చంద్రశేఖర్‌కు మాత్రమే సాధ్యపడింది. ఇక్కడే ఉండి, అమెరికాలో రాబోయే సూర్యగ్రహణాన్ని ఖచ్చితంగా లెక్కగట్టాడాయన! సరళవిజ్ఞాన శాస్త్రానికి ఒక నాటకానికున్నంత జనాదరణ కల్పించడం ఆ రోజుల్లో రుచిరామ్ సాహ్నికి మాత్రమే వీలైంది. అనువైన రీతిలో సైన్స్ పరికరాలకు రూపకల్పన చేసి, వాటిని తయారు చేయించడం ఆయనకు చెల్లింది. వృక్షాలు స్పందించగలవని చెప్పిన జగదీశ్ చంద్రబోస్ వృక్ష శాస్త్రవేత్త కాదు. నిజానికి ఆయన భౌతిక శాస్త్రవేత్త. ఆయనకు కళలంటే ఇష్టం. కవిత్వమంటే చెవికోసుకునేవాడు. విశ్వకవి రవీంద్రుడికి సన్నిహిత మిత్రుడు. పదవులకోసం పాకులాడే యూనివర్సిటీ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు ప్రఫుల్ల చంద్ర రే జీవితంనుంచి ఎంతో నేర్చుకోవాల్సిఉంది. మహాత్మాగాంధీ అంతటివారు ఆయనకు గౌరవపూర్వకంగా నమస్కరించారంటే మాటలా? మనకు గల సత్తాను బట్టి మనల్ని మనం అంచనా వేసుకుంటాం. మనం చేసిన పన్నుల్ని బట్టి మనల్ని అంచనావేస్తారు అన్న అమెరికన్ కవి లాంగ్‌ఫెలో మాటలు ప్రఫుల్లచంద్ర రే విషయంలో నిజమయ్యాయి. ఆయన చేసిన త్యాగాలు, గడిపిన అతి సాధారణ జీవితం జాతిపితనే ఆశ్చర్యంలో ముంచేసిందంటే ఇక ఏమనుకోవాలి?

భారతరత్న ఇచ్చారు కదా అని ఎప్పుడూ మీ ప్రభుత్వాన్ని పొగుడుతూ ఉండను. వాస్తవాలు ఖచ్చితంగా తెలియజేస్తాను. అని నెహ్రూ అంతటివాడితో నిక్కచ్చిగా వ్యవహారం నడిపిన వాడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య. అలాగే పంజాబ్ రసాయనిక శాస్త్రవేత్త పురాన్‌సింగ్ గొప్ప దార్శనికుడు, మానవతావాది, కవి. పబ్లిసిటీకి, ఆర్భాటాలకు ఎప్పుడూ విలువ ఇవ్వకుండా, సామాన్యుల్లో సామాన్యుడిగా బతికిన దేవేంద్రమోహన్ బోస్‌కు ఒక దశలో నోబెల్ పురస్కార గ్రహీత పావెల్ వినమ్రంగా ఎందుకు కృతజ్ఞతలు తెలియజేసుకున్నాడు? పోర్ట్‌ట్రస్ట్‌లో గుమస్తాగా పనిచేసే శ్రీనివాస రామానుజం గణితశాస్త్ర సూత్రీకరణలు ఎలా చేయగలిగాడు? విదేశాలలో పెద్దపెద్ద చదువులు చదవకుండానే పెద్ద పెద్ద ప్రయోగశాలలు సందర్శించకుండానే, తనకుతానుగా ఒక కాకలు తీరిన శాస్త్రజ్ఞుడిగా తయారై, నోబెల్ బహుమతి సాధించగలగడం సీవీ రామన్‌కి ఎలా సాధ్యపడింది? కేవలం రికార్డులకోసం వెర్రిమొర్రి పనులు చేస్తున్న నేటి ప్రపంచ యువతీ యువకులంతా సి.వి.రామన్ జీవితంలోని రికార్డులను ఛాలెంజ్ చేయగలరేమో బేరీజు వేసుకోవచ్చు. ఆర్థికశాఖలో ఉద్యోగం చేస్తూ, ఆయన భౌతికశాస్త్రంలో నోబెల్ స్థాయి పరిశోధనలు చేస్తారని ఎవరైనా ఊహించగలిగారా? జీవితంలో ఏదైనా సాధించాలనుకుంటే కొన్నిటిని



వదులుకోక తప్పదు అనేది రామన్ జీవితం స్పష్టం చేసింది.

కరవులు ఎందుకొస్తాయి? తుపానులు ఎందుకొస్తాయి? దారిద్ర్యానికి అంతం ఎప్పుడు? అని బాల్యంలో ఆలోచించిన మేఘనాథ్ సాహా, ఆ తరువాత ఈ దేశ వైజ్ఞానిక ప్రగతికి దోహదపడే ప్రణాళికల్ని తయారు చేయగలిగాడు. కవిత్వానికి తలవంచిన శాంతిస్వరూప్ భట్నాగర్, మిర్జాగాలిబ్ సమాధి కట్టించాడు. అలాగే కరైకుడి గ్రామంలో జాతీయసంస్థ ఏర్పాటు చేయాల్సివచ్చినప్పుడు నెహ్రూజీ మన్ననలు పొందడానికి చిన్న చిట్కా ప్రయోగించాడు. వంద టాక్సీలు మాట్లాడి వాటిని విమానాశ్రయానికి, కరైకుడి సంస్థకు మధ్య అటు నుంచి ఇటూ, ఇటు నుంచి అటూ తిప్పించాడు. అంటే, అదంతా అభివృద్ధి చెందిన ప్రాంతమేనని భారత ప్రధానికి శాంతి స్వరూప్ ఒక భ్రమని కల్పించాడు. దేశవైజ్ఞానిక ప్రగతికి దోహదపడే ఒక జాతీయ సంస్థకు రూపమివ్వడానికి మంచితనంతో నెహ్రూజీని సంతృప్తి పరచిన వైనం మనల్ని అబ్బురపరుస్తుంది. తెలుసుకోవాలనుకున్న ఉత్సాహం ఈ తరంలో ఉండాలేగానీ, మహోన్నత వ్యక్తిత్వం గల శాస్త్రవేత్తల జీవితాలు ప్రతి ఒక్కరికి కనువిప్పు కలిగిస్తాయి. స్ఫూర్తినందిస్తాయి.

ఈ విధంగా భారతీయ వైజ్ఞానిక చరిత్రనుండి ఎన్ని విషయాలైనా చెప్పుకోవచ్చు. మనసమాజపు ఆలోచనా ధోరణి మారాలి. ఇలాంటి మహోన్నతుల్ని జ్ఞాపకం చేసుకునే జాతీయ విధానమే మనకు లేదు. సామాన్యజనాల్ని వదిలేద్దాం. చాలామంది ప్రముఖులకే నేను పైన చెప్పిన శాస్త్రవేత్తల పేర్లు తెలియకపోవచ్చు. ఇక ఇప్పుడైనా తెలుసుకోవాలి. ఇంతటి వైజ్ఞానిక ప్రగతిని సాధించడానికి జీవితాల్ని ధారపోసిన మహానుభావుల్ని గుర్తు చేసుకోవడం, వారిపట్ల గౌరవభావం నిలుపుకుంటూ ఉండడం చేస్తూ ఉండాలి. తప్పదు. లేదా కృతఘ్నులుగా మిగిలిపోతాం. ఒకప్పుడు దేశ చక్రవర్తులకు అందుబాటులో లేని సౌకర్యాలు ఈ రోజు సామాన్యులు కూడా అనుభవిస్తున్నారు. కదా? ఉదాహరణకు ఈ-మెయిల్, వాట్సప్, మైక్రోసర్జరీ, అవయవాల మార్పిడి, ఒకే చెట్టుకు పదిరకాల పండ్లు పండించే బయో ఇంజినీరింగ్..ఎన్నో ఎన్నెన్నో..ఇకపోతే భారత్ ప్రయోగించిన అంతరిక్ష ఉపగ్రహాలు కూడా చెప్పుకోదగ్గవే! భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అంతరిక్షంలో మరో ఘన విజయం సాధించి దేశకీర్తి పతాకను దిగ్విజయంగా ఎగరేసింది. ఒకేసారి ఎనిమిది ఉపగ్రహాలను రెండు వేర్వేరు కక్ష్యలలో ప్రవేశపెట్టి 26 సెప్టెంబరు 2016, సోమవారం అరుదైన చరిత్ర సృష్టించింది. సంతోషించాల్సిన విషయమేమంటే ఇందులో యువతరానికి చెందిన మన పరిశోధక విద్యార్థుల కృషి ఎక్కువగా ఉంది. మన దేశం ప్రయోగించిన మూడు ఉపగ్రహాలతోపాటు, అమెరికా ఉపగ్రహం 'పాత్‌ఫైండర్', కెనడాకు చెందిన ఎన్.ఎల్.ఎస్-19, జర్మనీకి చెందిన వల్లర్ వెంటా-1, అల్జీరియాకు చెందిన అల్‌శాట్-1బి, 2బి, 1ఎన్ ఉపగ్రహాల్నికూడా మన దేశమే శ్రీహరికోట ఇస్రో నుండి ప్రయోగించింది. 1969లో ఇస్రో ఏర్పడినప్పుడు ఇంత త్వరితగతిన ప్రగతి సాధిస్తామని అనుకోలేదు. అందుకు ప్రణాళికలు రూపొందించి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సహాయ సహకారాలతో, విక్రమ్ సారాభాయ్ 1962లో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ ఆవిర్భావానికి కారకులయ్యారు. కాలక్రమంలో 'ఇస్రో' ఏర్పడింది. అది, దేశ ఘనతను అంతర్జాతీయ సమాజానికి తేటతెల్లం చేస్తూ వస్తోంది.

ఏది ఏమైనా కాలప్రవాహంలో మనం ఏ మహానుభావుడి గురించి తెలుసుకున్నా..మనకు ఒకవిషయం స్పష్టంగా తెలుస్తుంది. ఎవరైనా సరే, వ్యక్తులుగా ఎదిగినప్పుడే వారు మానవాళికిఉపయోగపడే అద్భుతాలు సాధించారు. సాధిస్తున్నారు. వారు శాస్త్రవేత్తలైనా, కవులైనా, గాయకులైనా, క్రీడాకారులైనా, చిత్రకారులైనా, లేదా ఇతర రంగాలలోని ఏ నిపుణులైనా సరే-ఎవరైనా సరే..ఒక స్థాయిని అందుకోవడం కష్టం. అందుకున్నాక సైన్సు, కళలు, సామాజిక,ఆర్థిక అంశాల మధ్య అడ్డుగోడలు తొలగిపోయి అన్నీ ఒకే పరిధిలో కనిపించడం విశేషం. కారణం, అన్నీ మానవాభ్యుదయం కోసమే కదా..!!

కేంద్ర సాహిత్య అకాడమీ విజేత, జీవశాస్త్రవేత్త

వందే భారత్ రైలుకు మరో ప్రమాదం

గాంధీనగర్: ముంబై-గాంధీనగర్ మధ్య కొద్దివారాల క్రితం ప్రారంభమైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రమాదం జరిగింది. శనివారం గుజరాత్‌లోని అతుల్ రైల్వే స్టేషన్ పరిధిలో సెమీ హై స్పీడ్ రైలును పశువు ఢీకొనడంతో కొద్దిసేపు ఆగిపోయింది. నెలరోజుల వ్యవధిలో ఈ తరహాలో జరిగిన మూడో ఘటన ఇది. ఈ రైలు డ్రైవర్ బోగీ నోస్ కోన్ కవర్ ధ్వంసమైందని భారత రైల్వే శాఖ వెల్లడించింది. గాంధీనగర్-ముంబై మధ్య వందే భారత్ సెమీ-హైస్పీడ్ రైలును ప్రధాని మోదీ ఇటీవలే జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అక్టోబర్ 1 నుంచి ఈ రైలు సేవలు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. అయితే తరచూ ఈ ప్రమాదాలు వెలుగుచూస్తున్నాయి. పశువులు ఢీ కొట్టే ఘటనలను తప్పించలేమని, రైలు డిజైనింగ్ సమయంలో వీటిని పరిగణనలోకి తీసుకుంటామని గతంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

రాజకీయాల్లోకి కంగనా రనావత్

ముంబై: ప్రముఖ సినీ నటి, ఫైర్‌బ్రాండ్ కంగనా రనావత్ త్వరలో రాజకీయ అరంగేట్రం చేయనున్నారు. ఇప్పటికే అటు సినిమా రంగంతో పాటు ఇటు రాజకీయంగానూ తన మార్క్ చూపిస్తున్నారు. ఇప్పటి వరకు సినిమా రంగంలో అనేక అంశాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచిన కంగనా.. అనేక సందర్భాల్లో బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా తన రాజకీయ ప్రవేశంపై కంగనా రనావత్ ఎట్టకేలకు స్పందించారు. ప్రజలు కోరుకుంటే... బీజేపీ అవకాశం ఇస్తే తాను వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తన మనసులో మాటను వెల్లడించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఉన్న కంగనా శనివారం ఆజ్‌తక్ పంచాయత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. హిమాచల్ ప్రజలు కోరుకుంటే, తనకు బీజేపీ టికెట్ ఇస్తే.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.

మీ సమాధానమేమిటి?

మహిళల సంతానోత్పత్తి హక్కులపై సుప్రీం

న్యూఢిల్లీ: మహిళల సంతానోత్పత్తి హక్కులపై వయో పరిమితికి సంబంధించి పిటిషన్‌పై కేంద్రానికి సర్వోన్నత న్యాయస్థానం నోటీసు జారీచేసింది. గర్భధారణకు ముందు, ప్రీనేటర్ డయాగ్నిస్టిక్ టెస్టుల కోసం మహిళల సంతానోత్పత్తి హక్కుల వయోపరిమితి 35 ఏళ్లుగా ఉండటాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో న్యాయవాది మీరా కౌరా పటేల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా విచారించారు. దీనిపై తమ వైఖరి వెల్లడించాలని కేంద్రానికి సూచించారు. ఇదే విషయమై సర్వోన్నత న్యాయస్థానం ఇంతకుముందు కీలక తీర్పును వెలువరించింది. ఎంటీపీ (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) చట్టం కింద గర్భిణి 24 వారాల వరకు గర్భవిచ్ఛిత్తికి ఆస్కారం ఉంటుందని, వైవాహిక సంబంధాల ఆధారంగా నిర్ణయాలు తగవని పేర్కొంది.

ఆజంఖాన్ శాసనసభ్యత్వం రద్దు

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ నేత, రాంపూర్ సదర్ ఎమ్మెల్యే ఆజంఖాన్ శాసనసభ్యత్వం రద్దయింది. యూపీ అసెంబ్లీ సెక్రటేరియట్ ఈ మేరకు ప్రకటించింది. విద్వేష ప్రసంగం కేసులో ఆజంఖాన్‌కు కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. దాంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెక్రటేరియట్ తెలిపింది. ఫలితంగా రాంపూర్ సదర్ స్థానం ఖాళీ అయినట్లు ప్రకటించింది. రెండేళ్లు, అంతకంటే ఎక్కువ జైలు శిక్ష పడిన ఎమ్మెల్యే శాసనసభ్యత్వం రద్దవుతుంది. శిక్ష పూర్తయిన తర్వాత ఆరేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులవుతారు.

ఇండిగో విమానంలో మంటలు

న్యూఢిల్లీ: ఇండిగో విమానం టేకాఫ్ సమయంలో మంటలు చెలరేగిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. విమానం దిల్లీ విమానాశ్రయం నుంచి బెంగళూరుకు బయల్దేరినప్పుడు శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఓ ప్రయాణికుడు దీనికి సంబంధించిన వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేశాడు. ఇంజిన్ నుంచి మంటలు రావడం చూసి విమానంలోని వారంతా ఉలిక్కిపడ్డారు. దీంతో వెంటనే విమానాన్ని అత్యవసరంగా దిల్లీ విమానాశ్రయంలోనే ల్యాండ్ చేశారు. శుక్రవారం రాత్రి 9:45 గంటలకు ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. రన్‌వేపై మరో ఐదారు సెకన్లలో విమానం టేకాఫ్ అవుతుందనగా ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు ఓ ప్రయాణికుడు తెలిపారు. ఘటన సమయంలో మొత్తం 184 మంది ప్రయాణికులు ఉన్నట్లు చెప్పారు. అయితే తాము 11 గంటల వరకు కిందకు దిగలేదని, విమానంలోని సిబ్బంది తమకు ధైర్యం చెప్పారని పేర్కొన్నారు. ఇండిగో సంస్థ అర్ధరాత్రి సమయంలో ఈ ప్రయాణికులందరినీ మరో విమానంలో బెంగళూరుకు తరలించినట్లు సమాచారం.

మతమార్పిడి వ్యవహారం... 9మందిపై కేసు

మీరట్: ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో బలవంతపు మత మార్పిడుల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కోవిడ్ సంక్షోభ సమయంలో ఆదుకుంటామనే మిషతో సుమారు 400 మందిని క్రైస్తవంలోకి బలవంతంగా మతమార్పిడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు తొమ్మిది మంది నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైస్తవ మతంలోకి మారేందుకు తమకు ఎన్నో ఆశలు చూపించినట్టు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. మగంట్ పూరమ్‌లోని మలిన్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హిందూ దేవతల విగ్రహాలకు దూరంగా ఉండాలంటూ తమను బలవంత పెట్టారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రాథమిక సమాచార నివేదిక ప్రకారం కోవిడ్ సంక్షోభ సమయాన్ని నిందితులు ఆసరగా తీసుకున్నారు. మతమార్పిడి కోసం డబ్బు, ఆహారం ఆశ చూపించారని, ఇప్పుడు క్రైస్తవాన్ని అంగీకరిస్తూ హిందూ దేవతల విగ్రహాలను, పటాలను తొలగించాలని తమపై ఒత్తిడి తెస్తున్నారని బాధితులు స్థానిక బీజేపీ నేతతో కలిసి బ్రహ్మపుత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాము సనాతన హిందూ ధర్మానికి కట్టుబడి ఉన్నట్టు వారు చెప్పారు. 'మతమార్పిడికి మాపై ఒత్తిడి తెస్తున్నారు. ఆధార్ కార్డులలో పేర్లు మార్చుకోవాలని అడుగుతున్నారు. దీపావళి రోజు పూజలు చేస్తుంటే ఇళ్లల్లోకి చొరబడి విగ్రహాలు ధ్వంసం చేశారు. మీరు మతం మార్చుకుని కూడా ప్రార్థనలు ఎందుకు చేస్తున్నారంటూ ప్రశ్నించారు? మేం నిరసన తెలిపితే చంపుతామంటూ బెదరించారు' అని బాధితులు శివ, బిన్నె, అనిల్, సర్దార్, నిక్కు, బసంత్, ప్రేమ, టిట్లి, రాణి తదితరులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు అందిన ఫిర్యాదుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పీ పీయూష్ సింగ్ తెలిపారు.

పోలీసు నియామకాలేవి: వరుణ్

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ తన సొంత పార్టీ అధికారంలో ఉన్నాగానీ తప్పులు ఎత్తిచూపడంలో ఏ మాత్రం మొహమాట పడటం లేదు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ ప్రశ్నిస్తున్నారు. తాజాగా ఉత్తరప్రదేశ్ పోలీసుల నియామకాల్లో తీవ్రజాప్యంపై యోగి ప్రభుత్వాన్ని నిలదీశారు. లక్షలాది మంది యువకుల అర్హత వయస్సు మించిపోయిందని, నాలుగేళ్లుగా నియామకాలు లేవని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'నియామకాలు చేపట్టలేదు. అందుకు ఆశ లేదు. వాళ్లు (అభ్యర్థులు) సామాజిక మాధ్యమాల ద్వారా గొంతు వినిపించినా ఎవరూ పట్టించుకోలేదు. విద్యార్థుల పరిస్థితి కూడా ఇదే. వారు వీధుల్లోకి వస్తే సమస్య పెద్దదవుతుంది. ఇది అన్యాయం కాక మరేమిటి?' అంటూ వరుణ్ గాంధీ హిందీలో ట్వీట్ చేశారు.

జర్నలిస్టులకు నగదు బహుమతి

మరో వివాదంలో కర్ణాటక సీఎం

తక్షణమే దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ డిమాండ్

బెంగళూరు: కర్ణాటకలో సీఎం బసవరాజు బొమ్మై మరో వివాదంలో చిక్కుకున్నారు. దీపావళి సందర్భంగా ముఖ్యమంత్రి బొమ్మై కార్యాలయానికి చెందిన అధికారి ఒకరు జర్నలిస్టులకు రూ.లక్షల్లో నగదు బహుమతులు పంపించారని ఆరోపణలు వచ్చాయి. కొందరు జర్నలిస్టులకు స్వీటు బాక్సులతో పాటు రూ.లక్ష నుంచి రూ.2.50లక్షల వరకు లంచాలు పంపినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీంతో ఈ వ్యవహారంపై దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దీపావళి పండగ సందర్భంగా రాష్ట్రంలోని మీడియా సంస్థలకు చెందిన డజను మంది సీనియర్ జర్నలిస్టులకు సీఎం కార్యాలయం నుంచి స్వీటు బాక్సులు గిఫ్టులుగా వెళ్లాయి. అయితే అందులో మిఠాయిలతో పాటు రూ.లక్షల్లో డబ్బులు ఉన్నట్లు కొన్ని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ విషయాన్ని సదరు జర్నలిస్టులు స్వయంగా అంగీకరించినట్లు పేర్కొన్నాయి. వీరిలో కొందరు విలేకరులు ఈ విషయాన్ని తమ సంస్థ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారట. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన డబ్బును తిప్పి పంపించినట్లు ఓ జర్నలిస్టు వెల్లడించారు. ఈ వ్యవహారం రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపింది. దీనిపై ఓ స్వచ్ఛంద సంస్థ.. కర్ణాటక లోకాయుక్తకు ఫిర్యాదు చేసింది. సీఎం సన్నిహిత వ్యక్తి నుంచి మీడియా సంస్థల చీఫ్ రిపోర్టర్లకు ఈ గిఫ్టులు అందినట్లు పేర్కొంది. దీనిపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది.

కాంగ్రెస్ విమర్శలు..

తాజా ఘటన నేపథ్యంలో బొమ్మై సర్కారుపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. 'సర్కారు రూ.లక్షల్లో లంచాలు ఇచ్చేందుకు ప్రయత్నించింది. ఇది సీఎం ఆఫర్ చేసిన లంచం కాదా? ఈ లక్షలు ఎక్కడి నుంచి వచ్చాయి? ప్రభుత్వ ఖజానా నుంచా లేదా సీఎం వ్యక్తిగత ఖాతా నుంచా? దీనిపై ఈడీ/ఐటీ చర్యలు తీసుకుంటుందా? ఈ ప్రశ్నలకు బొమ్మై సమాధానం చెప్పగలరా?' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా ట్విటర్‌లో విమర్శించారు. దీనిపై న్యాయ విచారణ డిమాండ్ చేశారు.

ఎన్నికల బాండ్ల విరాళాలలో 95 శాతం బీజేపీకే

రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్

సూరత్: దాతలు భయంతో ఇతర పార్టీలకు నిధులు అందించడం లేదని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ శనివారం తెలిపారు. ఎన్నికల బాండ్ల ద్వారా ఇచ్చే మొత్తం విరాళాలలో 95 శాతం బీజేపీకే వెళుతున్నాయని ఆరోపించారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా ఇక్కడ విలేకరుల సమావేశంలో ప్రసంగించిన సీనియర్ నాయకుడు, కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వాలనుకునే కార్పొరేట్‌లను బీజేపీ 'బెదిరిస్తోంది' అని ఆరోపించారు. బీజేపీకి తప్ప ఇతర రాజకీయ పార్టీలకు ఎవరైనా విరాళాలిస్తే, వెంటనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు ఆ దాతల ఇళ్ల తలుపులు తడతారని చెప్పారు. మన ప్రజాస్వామిక దేశంలో విరాళాలు సైతం ఒకే పార్టీకి వెళ్లిపోతున్నాయన్నారు. బీజేపీ పెద్ద ఎత్తున సొమ్ము పోగేసుకుందని, దాంతో దేశవ్యాప్తంగా ఫైవ్ స్టార్ పార్టీ కార్యాలయాలు నిర్మించుకుంటోందని మండిపడ్డారు. విరాళాల ద్వారా వచ్చిన సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వాలను మార్చుతోందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూలగొట్టిన విషయాన్ని గుర్తు చేశారు. పాలక బీజేపీని 'ఫాసిస్ట్' శక్తి అని ఆరోపించిన గెహ్లాట్, పార్టీ ఏదైనా విధానం, కార్యక్రమం లేదా సూత్రాలకు బదులుగా మతపరమైన ప్రాతిపదికన ఎన్నికలను గెలుస్తుందని అన్నారు. మహాత్మా గాంధీ పుట్టిన గడ్డ గుజరాత్ అని, అయితే ఇక్కడ హింస, అశాంతి వాతావరణం ఉందని అన్నారు. ఈ పరిస్థితి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని తెలిపారు. బీజేపీ పట్ల అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తిగానే ఉన్నారన్నారు. ఈ ప్రభుత్వాన్ని మార్చవలసిన సమయం ఆసన్నమైందన్నారు. తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తమకు వ్యతిరేక వార్తలు రాకుండా డబ్బులు వెదజల్లుతున్నారని ఆరోపించారు. 'కేజ్రీవాల్ చేస్తున్నది ప్రజాస్వామ్యానికి కూడా ప్రమాదకరం. వారు తమకు వ్యతిరేకంగా ఏదైనా ప్రతికూల వార్తలను అణిచివేసేందుకు డబ్బు ఖర్చు చేస్తారు. వారి ప్రకటనలను నిరంతరం అమలు చేస్తారు. వారి టీవీ ఇంటర్వ్యూలు కూడా నకిలీవే. గత మూడు నెలల్లో అంతా మారిపోయిందన్న వాతావరణాన్ని (తమకు అనుకూలంగా) సృష్టించారు. కానీ అది నిజం కాదు. వాళ్ల మాయలు ప్రజలకు తెలుసు' అని రాజస్థాన్ సీఎం అన్నారు.

మీకు ఎవరు సీఎం కావాలి?

- ప్రజాభిప్రాయం కోరిన కేజ్రీవాల్
- 4న అభ్యర్థిని ప్రకటిస్తామని వెల్లడి

సూరత్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఇచ్చిన అభిప్రాయం ఆధారంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నవంబర్ 4న ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటిస్తుందని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శనివారం తెలిపారు. ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ నుంచి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరు ఉండాలనే దానిపై అభిప్రాయాలు తెలియజేయడానికి ఎస్ఎంఎస్, వాయిస్ మెయిల్, ఈ-మెయిల్ ద్వారా పార్టీని సంప్రదించాలని ప్రజలను కోరారు. గుజరాత్‌లో మార్పు వాతావరణం ఉందని, రాష్ట్రంలో ఆప్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు. 'ఈ రోజు, గుజరాత్ తదుపరి ముఖ్యమంత్రిగా ఎవరిని చూడాలనుకుంటున్నారని నేను గుజరాత్ ప్రజలను అడగాలనుకుంటున్నాను. ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి, మేము ఒక నంబర్‌ను విడుదల చేస్తున్నాము... 6357000 360. మీరు ఎస్ఎంఎస్, వాట్సాప్ సందేశాలు, వాయిస్ సందేశాలను పంపవచ్చు. మేము ఈ-మెయిల్‌ను కూడా విడుదల చేస్తున్నాము... 'ఇ-మెయిల్-ఆప్ఎన్‌వోసీఎంఏజీమెయిల్ డాట్ కామ్' అని కేజ్రీవాల్ చెప్పారు. నవంబర్ 3 సాయంత్రం 5 గంటల వరకు ఎస్ఎంఎస్, వాయిస్ మెయిల్ లేదా ఈ-మెయిల్ ద్వారా ప్రజలు తమ ఎంపికను నాలుగు మార్గాల్లో అందించవచ్చని, నవంబర్ 4న ఫలితాలను ప్రకటిస్తామని ఆయన తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ స్థానంలో భూపేంద్ర పటేల్‌ను నియమించినందుకు కేజ్రీవాల్ అధికార బీజేపీని లక్ష్యంగా చేసుకున్నారు. రాష్ట్ర ప్రజలను అడగకుండానే చేశారని అన్నారు. రూపానీని ఆ పదవి నుంచి తప్పించడం ద్వారా తప్పు జరిగిందని, ఆయనలో లోపాలున్నాయని బీజేపీ అంగీకరించిందని అన్నారు. 'అతను అవినీతిపరుడు లేదా అసమర్థుడు కాబట్టి అతను తొలగించబడ్డాడా? అతన్ని ఎందుకు తొలగించారు? ఏడాది క్రితం అతన్ని తొలగించారు. రూపానీని తీసుకువచ్చినప్పుడు వారు ప్రజలను అడగలేదు. ప్రజలను అడగకుండానే ముఖ్యమంత్రిని మారుస్తూనే ఉన్నారు' అని ఆప్ నేత అన్నారు. ఆప్‌లో అలాంటి పద్ధతి అనుసరించడం లేదని, తమ ముఖ్యమంత్రిగా ఎవరిని చూడాలనుకుంటున్నారో నిర్ణయించుకోవాలని పార్టీ ప్రజలను కోరుతుందని ఆయన అన్నారు. 'పంజాబ్ ఎన్నికల సమయంలో తదుపరి ముఖ్యమంత్రి ఎవరు కావాలని మేము ప్రజలను అడిగాము. ప్రజలు భారీ మెజారిటీతో భగవంత్ మాన్ పేరు పెట్టారు. ప్రజల కోరిక మేరకు ఆయన పేరును ప్రకటించాం' అని కేజ్రీవాల్ తెలిపారు. 182 స్థానాలున్న గుజరాత్ శాసన సభ ఎన్నికలు ఈ ఏడాది చివరికి జరగవలసి ఉంది. ఎన్నికల షెడ్యూలును ఇంకా ప్రకటించలేదు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ సిలబస్‌లో మార్పు

న్యూఢిల్లీ: దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ప్రవేశాల కోసం వచ్చే ఏడాది నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష సిలబస్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. మొత్తం మూడు సబ్జెక్టుల (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్)కు జాయింట్ అడ్మిషన్స్ బాడీ (జేఏబీ) కొత్త సిలబస్‌ను రూపొందించింది. ఇకపై జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మరిన్ని చాప్టర్లు ఉంటాయని, కొత్త సిలబస్ జేఈఈ మెయిన్‌కు అనుగుణంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఏటా జేఈఈ మెయిన్ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థులను జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అనుమతిస్తున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కీలక సబ్జెక్ట్ ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీకి సంబంధించిన సిలబస్‌ను ప్రధానంగా రివైజ్ చేశారు. అయితే ఇది 2024 నుంచి అమల్లోకి రానుంది.

సబ్జెక్ట్స్ వారీగా మార్పులు...

జేఈఈ అడ్వాన్స్‌డ్ కొత్త సిలబస్‌లో.. మ్యాథ్స్‌లో స్టాటిస్టిక్స్ చేర్చారు. ట్రాంగిల్ సొల్యూషన్ టాపిక్‌ను తొలగించారు. ఫిజిక్స్‌లో సెమీకండక్టర్స్, కమ్యూనికేషన్స్ విభాగాలు తొలగించారు. వీటి స్థానంలో జేఈఈ మెయిన్ సిలబస్‌లో ఉండే ఫోర్స్ అండ్ డ్యాఫ్ట్ ఆసిలేషన్స్, ఈఎం వేవ్స్ అండ్ పోలరైజేషన్ వంటి టాపిక్స్ కలిపారు. ఇక కెమిస్ట్రీ విభాగంలో గ్యాసెస్ అండ్ లిక్విడ్స్, అటామిక్ స్ట్రక్చర్, కెమికల్ బాండింగ్, మాలిక్యులార్ స్ట్రక్చర్ వంటి టాపిక్స్ కవర్ కానున్నాయి. అయితే ఈ మార్పులతో విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సి అవసరం లేదని విద్యామందిర్ క్లాసెస్ అకడమిక్స్ డైరెక్టర్ సౌరభ్ కుమార్ తెలిపారు. జేఈఈ మెయిన్ కంటే అడ్వాన్స్‌డ్‌లో తక్కువ సిలబస్ ఉందన్నారు. ఇప్పుడు మెయిన్స్ లోని టాపిక్స్‌ను అడ్వాన్స్‌డ్‌కు జోడించారని చెప్పారు. సాధారణంగా పెరిగిన సిలబస్ విద్యార్థుల్లో ఒత్తిడి పెంచినట్లు అనిపించవచ్చు. అయితే జేఈఈ అడ్వాన్స్‌డ్ తీసుకున్న విద్యార్థులు జేఈఈ మెయిన్స్ కూడా ప్రిపేర్ అయి ఉంటారు. కాబట్టి సిలబస్‌లో మార్పుపై అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సౌరభ్ పేర్కొన్నారు. ఐఐటీ ఎంట్రన్స్ కొత్త సిలబస్ మార్పులు చూసి, ఆ టాపిక్స్‌పై దృష్టి పెట్టాలని సూచించారు.

అగ్రస్థానంలో 'భారత రక్షణశాఖ'

రెండు, మూడు స్థానాల్లో అమెరికా, చైనా

న్యూఢిల్లీ: దాదాపు 29.2 లక్షల ఉద్యోగులతో ప్రపంచంలోనే అతిపెద్ద యజమానిగా భారత రక్షణ మంత్రిత్వశాఖ అగ్రస్థానంలో నిలిచిందని తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. భారత్ తర్వాత అమెరికా రక్షణశాఖ రెండో స్థానంలో ఉందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా మార్కెట్, వినియోగదారుల గణాంకాలకు సంబంధించి జర్మనీకి చెందిన 'స్టాటిస్టా' సంస్థ తాజాగా ఓ నివేదిక రూపొందించింది. ప్రపంచంలోనే అతిపెద్ద యజమానుల ర్యాంకింగ్స్‌లో భారత రక్షణ మంత్రిత్వశాఖ అగ్రస్థానంలో నిలిచిందని ఈ నివేదిక వెల్లడించింది.

క్రియాశీల సర్వీసు సిబ్బంది, రిజర్విస్టులు, పౌర సిబ్బంది కలిపి మొత్తంగా ఈ శాఖలో 29.2లక్షల మంది విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపింది. 29.1లక్షల మంది సిబ్బందితో అమెరికా రక్షణశాఖ రెండో స్థానంలో ఉంది. ఇక, చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో దాదాపు 25లక్షల మంది ఉద్యోగులున్నట్లు నివేదిక పేర్కొంది. అయితే ఇందులో పౌర సిబ్బందిని కలపలేదు. 'అమెరికా రక్షణశాఖకు సమానమైన చైనా సెంట్రల్ మిలిటరీ కమిషన్‌లో దాదాపు 68 లక్షల మంది ఉద్యోగులు ఉండొచ్చు. అయితే ఆ సంఖ్యను జాబితాలో చేర్చడానికి నమ్మదగినదిగా అనిపించలేదు' అని నివేదిక పేర్కొంది. ఇదిలా ఉండగా.. కంపెనీల పరంగా అత్యంత ఎక్కువ మంది ఉద్యోగులున్న సంస్థగా అమెరికాకు చెందిన వాల్‌మార్ట్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ కంపెనీలో 23 లక్షల మంది ఉద్యోగం చేస్తున్నారు. వాల్‌మార్ట్ తర్వాత 16 లక్షల మంది సిబ్బందితో అమెజాన్ రెండో స్థానంలో ఉంది.

పేలిన సిలిండర్లు.. ఎగసిపడిన మంటలు

30మందికి గాయాలు... 25మంది పరిస్థితి విషమం

ఔరంగాబాద్: బీహార్‌లోని ఔరంగాబాద్‌లో శనివారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వంట చేస్తోన్న సమయంలో సిలిండర్లు పేలి, భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. చాత్ పూజకు సిద్ధమవుతోన్న వేళ.. ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో 30 మందికి పైగా గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. నగరంలోని శాహ్‌గంజ్ ప్రాంతంలో చాత్ పూజ నిమిత్తం ఓ కుటుంబం శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో వంట సిద్ధం చేస్తోంది. సూర్యోదయం లోపులో ప్రసాదం తయారుచేసే పనిలో నిమగ్నమైంది. అయితే.. షార్ట్‌సర్క్యూట్ కారణంగా సిలిండర్లకు మంటలు అంటుకుని.. భారీగా వ్యాపించాయి. వాటిని ఆర్పేందుకు చేసే ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. దాంతో ఈ ఘటనలో 30 మంది గాయాలపాలయ్యారు. 25 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కొంతమంది సిబ్బంది కూడా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం వెంటనే ఔరంగాబాద్‌లోని సదర్ ఆసుపత్రికి తరలించారు. ఘటనకుగల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దిల్లీలో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

తీవ్రస్థాయిలో గాలి కాలుష్యం.. శ్వాస తీసుకోవడానికీ ఇబ్బంది

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గాలి నాణ్యత రోజురోజుకీ పడిపోతోంది. దీపావళి పండుగ సందర్భంగా బాణసంచాపై ఆప్ ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో గాలి కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకుంది. శనివారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 309గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఇక నగరంలోని మథురా రోడ్డు, బారఖాంబా రోడ్డు, ప్రగతి మైదాన్ వంటి రోడ్లపై గాలి కాలుష్యం అత్యంత తీవ్రస్థాయిలో ఉందని అధికారులు తెలిపారు. దీంతో అక్కడి ప్రజలు శ్వాస తీసుకోవడానికి కూడా ఎంతో ఇబ్బంది పడుతున్నారు. గాలి కాలుష్యం కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని, ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని సుఖ్‌దేవ్ అనే రిక్షా కార్మికుడు తెలిపారు. గాలి నాణ్యతను పరిశీలిస్తే.. సున్నా నుంచి 50 మధ్య ఉంటే.. గాలి స్వచ్ఛంగా ఉందని అర్థం. 51 నుంచి 100 వరకు గాలి నాణ్యత బాగానే ఉన్నట్టు. ఇక 101 నుంచి 200 వరకు అంటే.. గాలిలో మితమైన నాణ్యత ఉన్నట్లు, 201 నుంచి 300 వరకు తక్కువ నాణ్యత ఉందని అర్థం. 301 నుంచి 400 వరకు అంటే నాణ్యత లోపించినట్టు. 401 నుంచి 500 వరకు గాలి నాణ్యత ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లుగా పరిగణిస్తారు.

'రెడ్‌లైట్ ఆఫ్...'కు అనుమతివ్వండి

ఆప్ డిమాండు: ఎల్‌జీ ఇంటి వద్ద నిరసన

నూదిల్లీ: 'రెడ్‌లైట్ ఆన్, గాడీ ఆఫ్'కు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతి ఇవ్వకపోవడంతో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) శనివారం ఆయన ఇంటి వద్ద నిరసన చేపట్టింది. 'రెడ్‌లైట్ ఆన్, గాడీ ఆఫ్' ప్రచారానికి అనుమతివ్వాలని నిరసనకారులు డిమాండు చేశారు. వారు భారీ సంఖ్యలో రాజ్‌నివాస్ మార్గ్‌కు చేరుకొన్నారు. సక్సేనాకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి భారీగా పోలీసులను మోహరించారు. జలఫిరంగులనూ సిద్ధం చేశారు. కాగా, రెడ్‌లైట్ ఆన్, గాడీ ఆఫ్ ప్రచారం శుక్రవారం మొదలు కావాల్సి ఉండగా ఎల్‌జీ అనుమతివ్వని కారణంగా వాయిదా వేసినట్లు దిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ తెలిపారు. 'గతంలో సత్ఫలితాలు ఇచ్చిన 'రెడ్‌లైట్ ఆన్, గాడీ ఆఫ్' ప్రచారానికి లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతివ్వలేదు. ఈనెల 21న ఎల్‌జీ వద్దకు సంబంధిత ఫైలు చేరింది' అని రాయ్ వెల్లడించారు.

బకాయిల కోసం చెరకు రైతుల నిరసన

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని కుషినగర్ జిల్లాకు చెందిన చెరకు రైతులు ఆందోళన బాట పట్టారు. కుషినగర్‌లోని కప్తంగంజ్ చక్కెర మిల్లు యాజమాన్యం రైతులకు చెల్లించాల్సిన రూ.44 కోట్ల బకాయిల్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. రెండువారాలుగా నిరసనలు చేస్తున్నారు. ఈ విషయంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్‌కు లేఖ రాసినా ప్రయోజనం లేకపోయిందని రైతు సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చెరకు రైతులకు మద్దతుగా సమాజ్‌వాదీ పార్టీ నేతలు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నిరసనల్లో పాల్గొన్న 30 మంది నిరసనకారులపైన, సమాజ్‌వాదీ పార్టీ మాజీ మంత్రి రాధేశ్యామ్‌సింగ్‌పైన 144 సెక్షన్‌ను ఉల్లంఘించారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్నికల వేళ తెరపైకి ఉమ్మడి పౌరస్మృతి

- కమిటీ ఏర్పాటుకు గుజరాత్ మంత్రివర్గం నిర్ణయం
- బీజేపీ వివాదాస్పద చర్య

అహ్మదాబాద్: మతాలను రెచ్చగొడుతూ విభజన ధోరణులు ప్రదర్శించే కాషాయ పార్టీ వివాదాస్పద నిర్ణయాలతో ఓట్ల దండుకొని అధికారం నిలబెట్టుకొనేందుకు అర్రులు చాస్తోంది. దేశమంతటా అదే పంథాను అనుసరిస్తోన్న బీజేపీ...తాజాగా గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, వివాదాస్పద ఉమ్మడి పౌరస్మృతి నిబంధన(యూసీసీ) అమలు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘ్వి శనివారం ప్రకటించారు. గాంధీనగర్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర మత్స్యశాఖ మంత్రి పర్షోత్తం రూపాలా దీనికి సంబంధించిన వివరాలను తెలియజేస్తూ...కమిటీ ఏర్పాటు ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. 'భూపేంద్ర పటేల్ నేతృత్వంలోని మంత్రివర్గం చివరి సమావేశంగా దీనిని పరిగణించాలి. ఎందుకంటే రాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ వచ్చే వారం ప్రకటిస్తారు' అని తెలిపారు. యూసీసీపై ఏర్పాటయ్యే ఈ కమిటీకి రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వం వహిస్తారని, ముగ్గురు నుంచి నలుగురు సభ్యులు ఉంటారని ఆయన వివరించారు. అంతకుముందు, తమ రాష్ట్రాల్లో యూసీసీ అమలు చేస్తామని ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వాలు ప్రకటించాయి. రూపాలా మాట్లాడుతూ 'మేము యువకులుగా ఉన్న రోజుల నుంచి కొన్ని డిమాండ్లు చేస్తున్నాము. రామ జన్మభూమి కోసం, ఆర్టికల్ 370 రద్దు, యూసీసీ కోసం. బీజేపీ పాత డిమాండ్‌ను నెరవేర్చే దిశగా తదుపరి అడుగు వేసినందుకు ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు నేను అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. రామమందిరం, కశ్మీర్ మాదిరిగా ఈ సమస్యను గుజరాత్ ప్రభుత్వం (కేబినెట్) ఆమోదించింది. త్వరలో ఒక కమిటీని ఏర్పాటు చేసి, దాని నివేదిక ఆధారంగా రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయడానికి మార్గం సుగమమవుతుంది. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తారు. కమిటీని ఏర్పాటు చేసే హక్కును ముఖ్యమంత్రికి కేబినెట్ ఇచ్చింది. దాని పని పరిధి కూడా నిర్ణయిస్తారు. కమిటీ ప్రకటన, కాల క్రమాన్ని ప్రకటిస్తారని నేను నమ్ముతున్నాను' అని అన్నారు. ఈ నిర్ణయానికి ప్రభుత్వ కారణాన్ని రూపాలా వివరిస్తూ 'దాడి జరిగితే, ఎవరైనా హిందూ, ముస్లిం, సిక్కు అని చూడలేము. అందరినీ ఒకే విధంగా చూడాలి. అయితే ఆస్తి విషయానికొస్తే, అది కూడా పిత్రార్జిత ఆస్తి, ఆ ఆస్తిపై భార్య, కూతురికి హక్కు ఉందా లేదా అన్నది కొడుక్కి ఇవ్వవచ్చా లేదా అనేది చూడాలి. ఇలాంటి వివాదాలు చాలా వరకు సమసిపోతాయి. పౌరులలోనూ 'ఈ వ్యక్తి పొందుతున్నాడు, ఆ వ్యక్తి పొందడం లేదు' అనే భావన ఉంది' అని తెలిపారు. 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి 'ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్' అనే డిమాండ్ ముందుకు వస్తోంది. ఈ డిమాండ్‌ను బలోపేతం చేయడానికి, జీఎస్టీ వచ్చినప్పుడు, అది ఎంత ప్రయోజనకరంగా ఉంటుందో మొదటిసారి మన దృష్టికి వచ్చింది. దేశమంతటా ఒకే చట్టం ఉంటే అది కావచ్చు. నేడు ఆ చట్టం స్థిరంగా మారింది. మొదట్లో కొన్ని భిన్నాభిప్రాయాలు వచ్చినా నేడు జీఎస్టీ నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకుంటున్నారు. మెజారిటీతో ఏ నిర్ణయం తీసుకోలేదు కానీ ఏకగ్రీవంగా తీసుకోలేదు' అని ఆయన చెప్పుకొచ్చారు. 'అదేవిధంగా యూసీసీని అమలు చేయడం ద్వారా పౌరుల హక్కులు, పౌర వివాదాలు... అది తల్లులు, సోదరీమణులు, పిల్లలు కావచ్చు. అన్ని ఏకరీతి హక్కులను ఇవ్వడం ద్వారా భారీ ఉపశమనం, సాధారణతను తీసుకురావడానికి చేసిన ప్రయత్నం' అని రూపాలా తెలిపారు. ఉత్తరాఖండ్ తర్వాత ఈ చొరవను దేశంలో ముందుకు తీసుకెళ్లినందుకు గుజరాత్ ప్రభుత్వానికి ఘనత లభిస్తుందన్నారు. గుజరాత్ విద్యాశాఖ మంత్రి జితు వాఘాని ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ... ఉమ్మడి పౌరస్మృతి నిబంధన అమలు చేయడం వల్ల చట్టపరమైన సమానత్వం ఏర్పడుతుందని, ఇది పౌరుల మధ్య సంఘీభావాన్ని కలిగిస్తుందని, న్యాయవ్యవస్థలో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించగలదని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఇదిలాఉండగా, ఎన్నికల ప్రవర్తనా నియమావళి విధించడానికి దాదాపు 10 రోజులు మిగిలి ఉన్నందున గుజరాత్ ప్రభుత్వం దీన్ని ఎలా అమలు చేయాలని యోచిస్తోందన్న మీడియా ప్రశ్నకు రూపాలా స్పందిస్తూ, 'అదే మీరు నమ్ముతారు. తదుపరి ప్రభుత్వం ఉంటుంది. మేము ఏర్పాటు చేస్తాము' అని అన్నారు.

మరో రెండేళ్లపాటు విదేశీ సాయం రద్దు

బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ మరో కీలక నిర్ణయం!

లండన్: బ్రిటన్ నూతన ప్రధాని రిషి సునాక్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక సంక్షోభం కారణంగా కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేసిన ఆయన విదేశీ సాయాన్ని మరో రెండేళ్లపాటు నిలిపివేయాలని భావిస్తున్నట్లు టెలిగ్రాఫ్ పత్రిక తన కథనంలో వెల్లడించింది. మొత్తం జాతీయ ఆదాయంలో 0.5శాతం మొత్తాన్ని బ్రిటన్ విదేశీసాయం కోసం వినియోగిస్తోంది. అయితే కరోనా నేపథ్యంలో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన యూకే.. రెండేళ్ల క్రితం విదేశీ సాయాన్ని పూర్తిగా నిలిపివేసింది. తాజాగా రిషి సునాక్ నేతృత్వంలోని ప్రభుత్వం దీనిని మరో రెండేళ్లపాటు పొడిగించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. విదేశీ సాయానికి సంబంధించిన అన్ని నిర్ణయాలను ప్రధానితోపాటు ఛాన్సలర్ ఉమ్మడిగా తీసుకుంటారని యూకే కోశాగారం అధికార ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. కరోనా విజృంభణకు ముందు బోరిస్ జాన్సన్ ప్రభుత్వంలో రిషి సునాక్ ఆర్థికశాఖ మంత్రిగా వ్యవహరించారు. పరిస్థితులు సాధారణ స్థితికి వస్తే 2024-2025 నాటికి విదేశీసాయాన్ని 0.7శాతానికి పెంచుతామని అప్పట్లో ఆయన పేర్కొన్నారు. కానీ, తాజాగా 2026-2027 వరకు విదేశీసాయాన్ని పూర్తిగా నిలిపివేయాలని రిషి ప్రభుత్వం యోచిస్తున్నట్లు టెలిగ్రాఫ్ వెల్లడించింది. బ్రిటన్ తీవ్ర ద్రవ్యోల్బణ పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేవలం విదేశీ సాయాన్ని నిలిపివేయడమే కాకుండా ఇతర అంశాల్లోనూ మరో మూడేళ్లపాటు కోతలు పడే అవకాశముందని రాసుకొచ్చింది. దేశంలో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చేందుకు ఆహారం, ఇంధనం, గృహకొనుగోలుపై పన్ను తగ్గింపును రద్దు చేస్తూ బ్రిటన్ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

ఎన్టీఆర్‌కు కర్ణాటక సీఎం ఆహ్వానం

హైదరాబాద్: టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ త్వరలో కర్ణాటక అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఆహ్వానం మేరకు నవంబర్ 1న అక్కడి అసెంబ్లీలో జరగనున్న 'కన్నడ రాజ్యోత్సవ' వేడుకల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ వేడుకల్లో భాగంగా కన్నడ స్టార్, దివంగత నటుడు పునీత్ రాజ్‌కుమార్‌కు కర్ణాటకలో విశిష్ట పురస్కారంగా భావించే 'కర్ణాటక రత్న' అవార్డు ఇవ్వనున్నారు. ఈ అవార్డు అందుకున్న తొమ్మిదో వ్యక్తిగా పునీత్ నిలించారు. తెలుగులోనే కాకుండా కర్ణాటకలోనూ ఎన్టీఆర్‌కు ఉన్న విశేష ఆదరణ, పునీత్‌తో ఆయనకు ఉన్న అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఆహ్వానం పంపించినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి తారక్‌తోపాటు రజనీకాంత్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత చంద్రశేఖర్ కంబర్, పునీత్ రాజ్‌కుమార్ కుటుంబానికి కూడా ఆహ్వానాలు అందాయి.

రష్యా నౌకాదళంపై డ్రోన్ దాడి

మాస్కో: రష్యా ఆక్రమిత క్రిమియాలో విధులు నిర్వర్తిస్తున్న మాస్కో దళాలపై డ్రోన్ దాడి జరిగింది. అయితే ఈ దాడిని క్రెమ్లిన్ నౌకాదళం సమర్థంగా తిప్పికొట్టిందని అధికారులు శనివారం వెల్లడించారు. కెర్చ్ వంతెన పేలుడుతో రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన వేళ.. ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. క్రిమియాలోని సెవాస్టోపోల్ పోర్ట్ వద్ద విధుల్లో ఉన్న మాస్కో నల్లసముద్రం నౌకాదళం లక్ష్యంగా శనివారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సెవాస్టోపోల్ గవర్నర్ మైఖెల్ రజ్వోజయెవ్ టెలిగ్రామ్‌లో వెల్లడించారు. కొన్ని గంటల పాటు మాస్కో ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఈ దాడులను తిప్పికొట్టాయని పేర్కొన్నారు. అన్ని మానవరహిత వాహనాలను రష్యా నేవీ కాల్చివేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం జరగలేదని, అధికారులు అప్రమత్తంగా ఉన్నారని వెల్లడించారు. అయితే ఈ దాడుల్లో రష్యాకు చెందిన అనేక యుద్ధ నౌకలు దగ్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి.

సాంస్కృతిక కార్యకర్తల అరెస్టు తగదు

అసోం ప్రభుత్వ చర్యను ఖండించిన ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసోం ప్రభుత్వం ఏకపక్షంగా సాంస్కృతిక కార్యకర్తలను అరెస్టు చేయడం, మియాన్ మ్యూజియంను చట్టవిరుద్ధంగా మూసివేయడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రానాయక్, చిన్నం పెంచలయ్య ఒక ప్రకటనలో ఖండించారు. అస్సాం ప్రభుత్వం అస్సాం మియా పరిషత్ కార్యాలయ బేరర్లను అరెస్టు చేయడాన్ని, మియా మ్యూజియాన్ని బలవంతంగా మూసివేయడాన్ని తప్పుపట్టారు. బంగ్లా మూలానికి చెందిన ముస్లింల నిరసన కవిత్వం నుంచి మియా పదం ఉద్భవించిందని, ప్రస్తుతం బంగ్లాదేశ్‌గా ఉన్న బెంగాల్‌లోని ఆ ప్రాంతం నుంచి ప్రజలను 19వ శతాబ్దంలో బ్రిటీషర్లు అస్సాంకు తీసుకువచ్చారన్నారు. అప్పటి నుంచి వారి హక్కులు, సాంస్కృతిక గుర్తింపు కోసం పోరాడుతున్నారని వివరించారు. వారి కోసం ధిక్కారంగా ఉపయోగించిన మియా అనే పదం వాస్తవానికి సాంస్కృతిక పోరాట సాధనంగా ఉపయోగించారని, మియా కవిత్వం ఈ పోరాటం ఫలితమని, చాలా ఏళ్ల క్రితం ప్రజల దృష్టిని ఆకర్షించిందని పేర్కొన్నారు. అక్టోబరు 25న గ్వాల్‌పరా జిల్లాలోని దప్‌కభితా వద్ద అస్సాం మియా పరిషత్ ఏర్పాటు చేసిన మ్యూజియంను ఈనెల 26న బలవంతంగా మూసివేశారని, మొహర్ అలీతో సహా ముగ్గురు పరిషత్ ఆఫీస్ బేరర్‌లను 'ఉపా' చట్టం కింద అరెస్టు చేశారని తెలిపారు. ఆ సామాజిక వర్గాన్ని కించపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారని పేర్కొన్నారు. పరిషత్ ఆఫీస్ బేరర్‌లందరినీ తక్షణమే విడుదల చేయాలని, మ్యూజియంను పునరుద్ధరించాలని, లేని పక్షంలో జాతీయ స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

చక్కెర ఎగుమతులపై ఆంక్షల పొడిగింపు

న్యూఢిల్లీ: దేశీయ మార్కెట్లో సరుకుల లభ్యతను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం చక్కెర ఎగుమతులపై ఆంక్షలను వచ్చే ఏడాది అక్టోబర్ 31 వరకు పొడిగించింది. గతంలో ఈ ఏడాది అక్టోబర్ 31 వరకు ఆంక్షలు విధించారు. 'చక్కెర (ముడి, శుద్ధి, తెలుపు చక్కెర) ఎగుమతిపై పరిమితి అక్టోబర్ 31, 2022 తర్వాత అక్టోబర్ 31, 2023 వరకు లేదా తదుపరి ఆర్డర్‌ల వరకు, ఏది ముందుగా ఉంటే అది పొడిగించబడింది. ఇతర షరతులు మారవు' అని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) అక్టోబర్ 28 నాటి నోటిఫికేషన్‌లో పేర్కొంది. అయితే సీఎక్స్‌ఎల్, టీఆర్‌క్యూ పన్ను రాయితీ కోటాల క్రింద అమెరికా, యూరప్‌కు ఎగుమతి చేసే చక్కెరపై ఈ పరిమితులు వర్తించవని పేర్కొంది. సీఎక్స్‌ఎల్, టీఆర్‌క్యూ (టారిఫ్ రేట్ కోటా) కింద నిర్దిష్ట మొత్తంలో చక్కెర ఈ ప్రాంతాలకు ఎగుమతి చేయబడుతుంది. ప్రస్తుత సంవత్సరంలో ప్రపంచంలో అత్యధిక చక్కెర ఉత్పత్తిదారుగా, రెండవ అతి పెద్ద ఎగుమతిదారుగా భారతదేశం ఉంది. ఒక ఎగుమతిదారు చక్కెరను ఎగుమతి చేయడానికి ప్రభుత్వం నుంచి లైసెన్స్ లేదా అనుమతి అవసరం. 2022-23 మార్కెటింగ్ సీజన్‌లో దేశంలో చక్కెర ఉత్పత్తి 36.5 మిలియన్ టన్నులుగా ఉంటుందని అంచనా వేయబడింది. ఇది క్రితం సంవత్సరంతో పోలిస్తే 2 శాతం పెరిగిందని పరిశ్రమల సంస్థ ఐఎస్ఎంఏ తెలిపింది. 2021-22 మార్కెటింగ్ సీజన్‌లో భారతదేశంలో ఉత్పత్తి 35.8 మిలియన్ టన్నులుగా ఉంది. సీజన్ అక్టోబర్-సెప్టెంబర్ వరకు ఉంటుంది. ఇథనాల్ కోసం అధిక మళ్లింపు ఉన్నప్పటికీ ఉత్పత్తిలో అంచనా పెరుగుదలతో ఈ సీజన్‌లో దాదాపు 9 మిలియన్ టన్నుల ఎగుమతి ఉంటుందని ఐఎస్ఎంఏ అంచనా వేసింది. భారత చక్కెర మిల్లు సంఘం (ఐఎస్ఎంఏ) మొదటి అంచనాను విడుదల చేస్తూ, 'చెరకు రసం/సిరప్, బి-మొలాసిస్‌లను ఇథనాల్‌కు మళ్లించడం వల్ల చక్కెర ఉత్పత్తిలో 45 లక్షల టన్నుల తగ్గింపును పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఐఎస్ఎంఏ 2022-23లో దాదాపు 36.5 మిలియన్ టన్నుల వద్ద చక్కెర ఉత్పత్తిని అంచనా వేసింది. ఎగుమతుల పై పరిశ్రమ సంఘం మాట్లాడుతూ బ్రెజిల్ చక్కెర మే 2023 నాటికి అంతర్జాతీయ మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉన్నందున ఈ సంవత్సరం భారతీయ చక్కెరకు ఎగుమతుల అవకాశం చాలా తక్కువగా ఉందని తెలిపింది. దక్షిణాదిలో చెరకు క్రషింగ్ ప్రారంభమైంది. మిగతా ప్రాంతాల్లో త్వరలో ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. అందువల్ల, కొన్ని నెలల తర్వాత దిగుబడి, చక్కెర నిల్వల వాస్తవ స్థితి అందుబాటులోకి వస్తుంది.

రెండు భారీ చిత్రాల్లో రజనీకాంత్

చెన్నై: తమిళస్టార్ రజనీకాంత్ రెండు క్రేజీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందనున్న సినిమాల్లో ఆయన హీరోగా నటించనున్నారు. ఈ వివరాలను ప్రకటిస్తూ రజనీకాంత్‌తో కలిసి దిగిన ఫొటో షేర్ చేసి ఆనందం వ్యక్తం చేశారు నిర్మాత సుభాస్కరన్, ప్రేమ్‌శివస్వామి. ఆ రెండు సినిమాలను నవంబరు 5న చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ రెండు చిత్రాలకు దర్శకుడు, నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటించనున్నారు. గతంలో రజనీకాంత్ హీరోగా నటించిన '2.ఓ' సినిమాను లైకా సంస్థ నిర్మించిన సంగతి తెలిసిందే. ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి విజయం సాధించిన మణిరత్నం చిత్రం 'పొన్నియిన్ సెల్వన్' కూడా ఈ సంస్థ నుంచి వచ్చిందే! తలైవా ప్రస్తుతం 'జైలర్' అనే సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రానికి నెల్సన్ దర్శకత్వం వహిస్తున్నారు.

'కాంతార'కు ఎదురుదెబ్బ

తిరువనంతపురం: విశేష ప్రేక్షకాదరణ పొందిన 'కాంతార'కు ఎదురుదెబ్బ తగిలింది. భూతకోల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రత్యేకంగా భావించే 'వరాహ రూపం' పాటను ఇకపై ప్రదర్శించకూడదని కేరళలోని కోజికోడ్ జిల్లా సెషన్స్ కోర్టు ఆదేశించింది. తాము రూపొందించిన 'నవరసం' ఆల్బమ్‌కు కాపీగా 'వరాహ రూపం' తీర్చిదిద్దారని పేర్కొంటూ కేరళకు చెందిన 'థాయికుడమ్ బ్రిడ్జ్' అనే మ్యూజిక్ బ్యాండ్ ఇటీవల న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. విచారణ అనంతరం తాజాగా ఈ తీర్పు వెలువడింది. దీంతో, వారి అనుమతి లేకుండా థియేటర్లలోనే కాకుండా యూట్యూబ్, ఇతర మ్యూజిక్స్ యాప్స్‌లోనూ దీన్ని ప్రదర్శించకూడదని కోర్టు పేర్కొంది. దీన్ని తెలియజేస్తూ థాయికుడమ్ బ్రిడ్జ్ ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టింది. ఈ విషయంలో తమకు అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు చెప్పింది. ప్రకృతి - మానవాళికి మధ్య ఉండాల్సిన సంబంధాలను తెలియజేస్తూ తెరకెక్కిన ఈ సినిమాలో 'వరాహ రూపం' పాటకు ప్రేక్షకుల నుంచి విశేషణ ఆదరణ లభించింది. భూతకోల ఆడే వ్యక్తిని పంజుర్లి దేవత ఆవహించిన సమయంలో వచ్చే ఈ పాట ప్రేక్షకుల్ని సినిమాలో లీనమయ్యేలా చేస్తోంది. ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాల్లో రిషబ్ నటనకు ఈ పాట తోడవడంతో ఆ సన్నివేశాలు మరోస్థాయికి వెళ్లాయి.

శ్రీలంకపై కివీస్ ఘనవిజయం

టీ20 ప్రపంచకప్‌లో ముగిసిన లంక కథ

సిడ్నీ: టీ20 ప్రపంచకప్ 2022లో శ్రీలంక కథ ముగిసింది. ఆసియాకప్ 2022 విజయంతో భారీ అంచనాలను అందుకున్న శ్రీలంక.. మెగా టోర్నీలో ఆ జోరును కొనసాగించలేక పోయింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నా.. వాటిలో విజయం సాధించినా లంక ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. వర్షం కారణంగా గ్రూప్-1లో మూడు మ్యాచ్‌లు రద్దవ్వడంతో సెమీఫైనల్ సమీకరణం గందరగోళంగా మారింది. ఏడేసి పాయింట్లు సాధించిన జట్లకే సెమీఫైనల్ చేరే దిక్కులేదు. ఈ పరిస్థితుల్లో చివరి రెండు మ్యాచ్‌లు గెలిచినా లంకకు 6 పాయింట్లే వస్తాయి. శనివారం న్యూజిలాండ్‌తో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో లంక చెత్త బ్యాటింగ్‌తో మూల్యం చెల్లించుకుంది. 65 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది.

ఫిలిప్స్ సెంచరీ..

ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు చేసింది. ఆ జట్టులో గ్లేన్ ఫిలిప్స్(64 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 104) సెంచరీతో చెలరేగాడు. 15 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన జట్టును వీరోచిత శతకంతో ఆదుకున్నాడు. అతనికి తోడుగా డారిల్ మిచెల్(24 బంతుల్లో 22) నాలుగో వికెట్‌కు 89 పరుగులు జోడించడంతో న్యూజిలాండ్ గౌరవ ప్రదమైన స్కోర్ చేయగలిగింది. లంక బౌలర్లలో కాసున్ రజిత రెండు వికెట్లు తీయగా.. మహీష్ తీక్షణ, ధనంజయ డిసిల్వా, వానిందు హసరంగా, లాహిరు కుమారా తలో వికెట్ తీసారు. ఓ దశలో కివీస్ 100 పరుగులైనా చేస్తుందా? అనిపించింది. కానీ ఆ జట్టు చెత్త ఫీల్డింగ్ కివీస్‌కు కలిసొచ్చింది.

చెత్త బ్యాటింగ్..

అనంతరం 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక 19.2 ఓవర్లలో 102 పరుగులకు కుప్పకూలింది. కివీస్ స్టార్ పేసర్ ట్రెంట్ బౌల్ట్(4/13) నాలుగు వికెట్లతో లంక పతనాన్ని శాసించగా.. మిచెల్ సాంట్నర్(2/21), ఇష్ సోదీ(2/21) రెండేసి వికెట్లతో దెబ్బతీశారు. టీమ్ సౌథీ, లూకీ ఫెర్గ్యూసన్ చెరో వికెట్ పడగొట్టారు. లంక బ్యాటర్లలో భానుక రాజపక్స(22 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34), దసన్ షనక(32 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 35) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.

దెబ్బతీసిన సౌథీ, బౌల్ట్

ఇన్నింగ్స్ తొలి ఓవర్ చివరి బంతికే సౌథీ.. శ్రీలంకకు షాకిచ్చాడు. ఓపెనర్ పాతుమ్ నిస్సంకను డకౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. ట్రెంట్ బౌల్ట్ వేసిన రెండో ఓవర్‌లో కుశాల్ మెండీస్(4), ధనంజ డిసిల్వా(0) వెనుదిరగ్గా.. తన మరుసటి ఓవర్‌లో చరిత్ అసలంక(4) ఔటయ్యాడు. దాంతో 8 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన శ్రీలంక.. పవర్ ప్లేలో 24 పరుగులే చేసింది. ఆ వెంటనే కేన్ మామ స్పిన్నర్లను రంగంలోకి దింపగా.. శాంట్నర్ వేసిన తొలి బంతికే చమిక కరుణరత్నే(3) ఔటయ్యాడు. దాంతో 24 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన లంక 100 పరుగులైనా చేస్తుందా? అనిపించింది.

రాజపక్స ఆదుకునే ప్రయత్నం చేసినా..

కానీ క్రీజులోకి వచ్చిన భానుక రాజపక్స.. కివీస్ బౌలర్లపై ఎదురు దాడికి దిగాడు. ధాటిగా ఆడుతూ జట్టు స్కోర్‌ను ముందుకు తీసుకెళ్లాడు. స్పిన్నర్లతో లాభం లేదని ఫెర్గూసన్‌ను తీసుకొచ్చిన కేన్ మామ.. రాజపక్సకు చెక్ పెట్టించాడు. ఆ తర్వాత హసరంగా(4), తీక్షణ(0), లాహిరు కుమారా(4)లను స్పిన్నర్లు ఔట్ చేయడంతో లంక పోరాటం ముగిసింది.

ఆ అవసరం కోహ్లికి లేదు: బిన్నీ

సిడ్నీ: టీ20 ప్రపంచకప్ 2022 టోర్నమెంట్ సూపర్ 12లో భాగంగా ఈనెల 23న మెల్‌బోర్న్‌లో జరిగిన భారత్‌పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌పై ఇప్పటికీ హాట్ డిబేట్స్ జరుగుతునే ఉన్నాయి. తన చిరకాల ప్రత్యర్థిపై టీమిండియా విజయాన్ని సాధించిన విధానం ప్రశంసలు అందుకుంటోంది. 31 పరుగులకు నాలుగు వికెట్లను కోల్పోయి, కష్టాల్లో పడిన సంక్లిష్ట పరిస్థితి నుంచి విజయం వైపు సాగిన జట్టు ప్రస్థానం, పాకిస్తాన్ తన తదుపరి మ్యాచ్‌లో జింబాబ్వే చేతిలో ఓడిపోవడం ఇందుకు కారణమైంది. పాకిస్తాన్‌పై మ్యాచ్‌లో హ్యారిస్ రవూఫ్ వేసిన 19వ ఓవర్ చివరి రెండు బంతులను కోహ్లి సిక్సులు మలిచిన విధానం ఇప్పుడిప్పుడే అభిమానుల స్మృతిపథం నుంచి చెరిగిపోయేలా కనిపించట్లేదు. క్రికెటర్లు, లెజెండరీ ప్లేయర్లు, మాజీలు, కామెంటర్లు ఈ సిక్సర్ల గురించి ప్రతీసారీ ప్రస్తావిస్తూనే వస్తోన్నారు. విరాట్ కోహ్లి గొప్పదనాన్ని వివరిస్తోన్నారు. సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి, బ్రెట్ లీ.. ఇలా చాలామంది కోహ్లిని ఆకాశానికెత్తేశారు. ఇప్పుడు తాజాగా భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ అధ్యక్షుడు రోజర్ బిన్నీ స్పందించారు. కోహ్లిపై ప్రశంసలు కురిపించాడు. అతడిని ఓ క్లాసిక్ ప్లేయర్‌గా అభివర్ణించాడు. ప్రతికూల పరిస్థితుల మధ్య ప్రత్యర్థిపై ఎలా విరుచుకుపడాలో.. తీవ్ర ఒత్తిళ్లను ఎలా జయించాలో పాకిస్తాన్‌పై గేమ్‌లో కోహ్లి చూపించాడని కితాబిచ్చారు. ఈ ఇన్నింగ్స్‌ను చూసి, ఒత్తిళ్ల మధ్య ప్రతి ఒక్క ప్లేయర్ కూడా కోహ్లిలా రాణించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.